పక్కా తెలుగు

ప్రభాత
# కిరణమ్
సత్యానికి వారధి

PRGI REGD NO.: TGTEL/26/A4986

5 DOTS NETWORK

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 005 | సోమవారం 29-06-2026 | పేజీలు : 8 | వెల : రూ. 4/- www.prabhathakiranam.com

Medchal Malkajgirii | Volume : 1 | Issue : 005 | Monday 29-06-2026 | Pages : 8 | Price : Rs. 4/- Circulated to Telangana Published from Medchal Malkajgiri




ఎలక్షన్.. సెలక్షన్.. కలెక్షన్...

## త్యాగమంటే ఇదేనా?

కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు

ఎందరో త్యాగాల ఫలితమే కేసీఆర్ ఫ్యామిలీకి పదవులు

నల్గొండ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లగొండ సభలో భారత్ రాష్ట్ర సమితిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఉద్యమాన్ని బీఆర్ఎస్ సొంతంగా చెప్పు కోవడం సరికాదని అన్నారు. త్యాగం అంటే ఎన్నికలు తెచ్చు కోవడం, పదవులు పొంద డం, కలెక్షన్లు చేసుకోవడం కాదని వ్యాఖ్యానించారు. అసలైన త్యాగం అంటే ఉద్యమం కోసం పదవు లను వదులుకున్న నాయకుల దేనని చెప్పారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వంటి నాయకులను ఉదాహరణ గా ప్రస్తావించారు. ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమర వీరులను మరువకూడదని అన్నారు.

- 2లో...

పూటకో పేరు మార్చుకునే మీరా...

## మమ్మల్ని విమర్శిస్తుంది?



### బీఆర్ఎస్‌పై కోమటిరెడ్డి ధ్వజం

నల్లగొండలో జరిగిన భారీ బహిరంగ సభలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భారత్ రాష్ట్ర సమితిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఒకప్పుడు టీఆర్ఎస్‌గా ఉన్న పార్టీ ఇప్పుడు బీఆర్ఎస్‌గా మారిందని, రేపు మరో పేరుతో వచ్చినా ఆశ్చర్యం లేదని వ్యాఖ్యా నించారు. పూటకో పార్టీ పేరు మార్చుకునే వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని, విమర్శలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

- 2లో...



## తెలంగాణపై బీజేపీ ఫోకస్

పశ్చిమ బెంగాల్ స్ఫూర్తితో పోరాటం

తెలంగాణలో కమలం వికసిస్తుంది

బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ ధీమా

అధికారమే లక్ష్యంగా పోరాడాలని పిలుపు

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలని సూచించారు. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ సాధించిన పురోగతిని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలో కూడా అదే ఉత్సాహంతో ముందుకు సాగాలని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

- 2లో...



## స్పీకర్ పదవి గౌరవం కాపాడండి

అప్పుల లెక్కలపై కేటీఆర్ సవాల్

వికారాబాద్ వేదికగా బీఆర్ఎస్ దూకుడు

వికారాబాద్‌లో కార్యకర్తల సమావేశం

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న డిజిటల్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

- 2లో...

హైడ్రా చీఫ్ రంగనాథ్‌పై

## ఈటల విసుర్లు

పేదల ఇళ్ల కూల్చివేతలపై వార్నింగ్

అస్మత్‌పేటలో బాధితులకు ఎంపీ పరామర్శ



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను లక్ష్యంగా చేసుకుని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ సీనియర్ నేత ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి అండ ఉందనే ధైర్యంతో ప్రజల ఇళ్లను ఇష్టానుసారంగా కూల్చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆవేదన, శాపం ఒకరోజు తప్పకుండా తాకుతుందని హెచ్చరించారు. కోర్టులు పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా, శనివారాలనే కూల్చివేతలు చేపట్టడం వెనుక ఉద్దేశం ఏమిటని ఈటల ప్రశ్నించారు.

- 2లో...





- 5లో...

### దేవుడే చట్టబద్ధ యజమాని

విరాళాలపై కీలక వివరణ

కేసులో న్యాయపరమైన కోణం

ఫామ్‌హౌస్ నుంచి స్కార్పియో వరకు

### రామాలయ విరాళాల కేసులో షాక్

మనీ ట్రయల్‌పై

## సిట్ దర్యాప్తు..

రామాలయ విరాళాల కేసులో సంచలనం

నిందితుల ఇళ్లపై సోదాలు, ఆస్తులపై ఆరా

అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో దర్యాప్తు మరింత వేగం అందుకుంది. కేసులో అరెస్టైన ఎనిమిది మంది నిందితుల ఇళ్లలో పోలీసులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ప్రత్యేక దర్యాప్తు బృందంతో పాటు స్థానిక మేజిస్ట్రేట్లు, రెవెన్యూ అధికారులు కూడా ఈ సోదాల్లో పాల్గొన్నారు. హుండీ ల్లో భక్తులు సమర్పించిన నగదు దుర్వినియోగానికి సంబంధించిన డబ్బు జాడను గుర్తించడమే ఈ సోదాల ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు.

- 3లో...

## ఉపాధి హామీ చట్టంపై కాంగ్రెస్ ధ్వజం

రాష్ట్రాలపై కొత్త భారం అంటూ విమర్శలు

కొత్త చట్టంపై హస్తం పార్టీ అభ్యంతరాలు

కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తీసుకొస్తున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్, గ్రామీణ చట్టంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ కొత్త చట్టం గ్రామీణ ప్రజలకు ప్రయోజనం కలిగించే బదులు అధికారాల కేంద్రీకరణకు దారితీస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు.



- 3లో...



## రక్షణ రంగంలో కొత్త శకం

- 3లో...

సముద్రం నుంచి ఆకాశం వరకు

స్వావలంబన దిశగా భారత్ పయనం

'మన్ కీ బాత్'లో ప్రధాని సందేశం

## స్వదేశానికి తిరిగి వెళ్తా!

షేక్ హసీనా ప్రకటనతో కలకలం

బంగ్లా రాజకీయాల్లో ఉత్కంఠ

ఈ ఏడాదే కొత్త ప్రయాణం షురూ



- 3లో...

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మరోసారి కీలక ప్రకటన చేశారు. అన్ని అడ్డంకులను అధిగమించి ఈ ఏడాదే స్వదేశానికి తిరిగి వస్తానని ప్రకటించారు. ప్రస్తుతం ప్రవాసంలో ఉన్న ఆమెపై మరణశిక్ష విధించబడిన పరిస్థితి ఉన్నప్పటికీ వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. తన స్వదేశానికి తిరిగి వెళ్లడం వ్యక్తిగత ఆశయం కాదని, ప్రజాస్వామ్య హక్కుల పునరుద్ధరణ కోసం జరుగుతున్న పోరాటంలో భాగమని పేర్కొన్నారు.



## చెదిరిన సెమీస్ కలలు

ఆస్ట్రేలియా దెబ్బతో భారత్‌కు షాక్

ఫలించని హర్మన్‌ప్రీత్ పోరాటం

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు నిరాశ ఎదురైంది. లార్డ్స్ వేదికగా జరిగిన కీలక మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ ఓటమితో భారత్ సెమీఫైనల్ అవకాశాలు పూర్తిగా ముగిశాయి. గ్రూప్-ఏలో మూడో స్థానంతో భారత్ టోర్నీ ప్రయాణాన్ని ముగించాల్సి వచ్చింది.

- 8లో...



## ఎలక్షన్.. సెలక్షన్.. కలెక్షన్...

# త్యాగమంటే ఇదేనా?

**కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు**
**ఎందరో త్యాగాల ఫలితమే కేసీఆర్ ఫ్యామిలీకి పదవులు**
**నల్గొండ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లగొండ సభలో భారత్ రాష్ట్ర సమితిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఉద్యమాన్ని బీఆర్ఎస్ సొంతంగా చెప్పుకోవడం సరికాదని అన్నారు. త్యాగం అంటే ఎన్నికలు తెచ్చుకోవడం, పదవులు పొంద డం, కలెక్షన్లు చేసుకోవడం కాదని వ్యాఖ్యానించారు. అసలైన త్యాగం అంటే ఉద్యమం కోసం పదవులను వదులుకున్న నాయకుల దేనని చెప్పారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వంటి నాయకులను ఉదాహరణగా ప్రస్తావించారు. ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమర వీరులను మరువకూడదని అన్నారు.

### కేసీఆర్ పాలనపై తీవ్ర ఆరోపణలు

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణపై వందేళ్లకు సరిపడే భారం మోపారని రేవంత్ ఆరోపించారు. రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ సమాజం ఇప్పటికే బీఆర్ఎస్ కుటుంబ రాజకీయాలను తిరస్కరించిందని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఆ పార్టీకి రాజకీయ స్థానం ఉండదని జోస్యం చెప్పారు.

### సంక్షేమ పథకాలపై వివరణ

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షలాది కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని సీఎం తెలిపారు. మూడు కోట్లకు పైగా ప్రజలకు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నాలుగున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. పేదల గౌరవం కోసం ఇళ్లు నిర్మిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం పేదల ఇళ్ల గురించి ఆలోచించకుండా ఫామ్ హౌస్‌ల నిర్మాణంపైనే దృష్టి పెట్టిందని విమర్శించారు.

### రైతులు, విద్య, ఉద్యోగాలపై హామీ

రైతు రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ పథకాల కోసం భారీగా నిధులు ఖర్చు చేశామని సీఎం పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్య అందించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. దళితులు, గిరిజనులు, పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు పాఠశాలలను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు.



**బహిరంగ చర్చకు సవాల్**

తమ ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు రావాలని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన, కేంద్రంలోని బీజేపీ పాలనపై చర్చిద్దామని ప్రతిపాదించారు. మూడు పార్టీల ఎన్నికల హామీల అమలుపైనా సభలోనే చర్చ జరగాలని అన్నారు. స్పీకర్‌కు ప్రతిపక్షాలు లేఖ రాస్తే ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు.

ముప్పై నెలల్లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు.

### మూసీ, ఎస్ఎల్‌బీసీపై స్పష్టత

మూసీ నది ప్రక్షాళన కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని రేవంత్ స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును వచ్చే ఎన్నికల నాటికి పూర్తి చేసి మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా విమర్శలు చేస్తూ భారీ వ్యయం చేసినా ఆశించిన ఫలితాలు రాలేదని అన్నారు. తెలంగాణ అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

### 2034 వరకు కాంగ్రెస్ అధికారం

ప్రజా పాలనను ప్రజలు ఆదరిస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనతో ప్రజల విశ్వాసం సంపాదించామని పేర్కొన్నారు. అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఫలించవని అన్నారు. 2024 నుంచి 2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## పూటకో పేరు మార్చుకునే మీరా...

# మమ్మల్ని విమర్శిస్తుంది?

### బీఆర్ఎస్‌పై కోమటిరెడ్డి ధ్వజం



నల్లగొండలో జరిగిన భారీ బహిరంగ సభలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భారత్ రాష్ట్ర సమితిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఒకప్పుడు టీఆర్ఎస్‌గా ఉన్న పార్టీ ఇప్పుడు బీఆర్ఎస్‌గా మారిందని, రేపు మరో పేరుతో వచ్చినా ఆశ్చర్యం లేదని వ్యాఖ్యానించారు. పూటకో పార్టీ పేరు మార్చుకునే వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని, విమర్శలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

### రూ.13 వేల కోట్లతో రోడ్ల నిర్మాణం

ప్రజలు సురక్షితంగా ప్రయాణించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్ల వ్యయంతో హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. అభివృద్ధి పనులు ప్రారంభం కాకముందే అవినీతి ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు. ప్రతిపక్షాలు వాస్తవాలను పక్కన పెట్టి రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నాయని ఆరోపించారు. ప్రజలకు మెరుగైన రహదారులు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యమని చెప్పారు.

### కాళేశ్వరం, ధరణిపై ఆరోపణలు

గత బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం, ధరణి పేర్లతో భారీ అవినీతి జరిగిందని కోమటిరెడ్డి ఆరోపించారు. రాష్ట్ర వనరులు దుర్వినియోగం అయ్యాయని విమర్శించారు. అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధి కంటే ప్రచారానికే ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. పదేళ్ల పాలనలో నల్గొండ జిల్లాకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు.

### ఎస్ఎల్‌బీసీపై కొత్త లక్ష్యం

ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు విషయాన్ని ప్రస్తావిస్తూ గతంలో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందని మంత్రి విమర్శించారు. గతంలో ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కొత్త కార్యాచరణతో ముందుకు సాగుతోందని చెప్పారు. 2028 ఆగస్టు నాటికి సొరంగం పూర్తి చేసి నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పనుల సమయంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు నివాళి అర్పించారు.

### మూసీ ప్రక్షాళనపై స్పష్టత

మూసీ నది పునరుజ్జీవానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. నకిరేకల్ ప్రాంతంలో ప్రవహిస్తున్న కాలుష్యాన్ని స్వయంగా వచ్చి చూడాలని ప్రతిపక్ష నేతలకు సూచించారు. మూసీ ప్రక్షాళనకు అడ్డంకులు సృష్టించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. కాలుష్యాన్ని తగ్గించి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

### రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై హామీ

గత ప్రభుత్వం పదేళ్లపాటు కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని కోమటిరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని అమలు చేస్తోందని గుర్తుచేశారు. ప్రతి గ్రామంలో 30 నుంచి 40 ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని వెల్లడించారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

### ఎన్నికలపై మంత్రి ధీమా

ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ బలంగా ఉందని కోమటిరెడ్డి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని 12 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు అభివృద్ధిని చూసి తీర్పు ఇస్తారని అన్నారు. విమర్శలతో కాదు, పనులతోనే ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే తమకు బలమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఓటు రక్షణపై ప్రజలకు సూచనలు

**సర్‌పై అప్రమత్తంగా ఉండండి**

**కార్పొరేటర్లతో ఎమ్మెల్యే మాధవరం**



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం నియోజకవర్గ కార్పొరేటర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ అంశంలో అధికారులకే పూర్తి స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగించే విషయమ న్నారు. అధికారులు ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రజలు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వలేక పోతున్నారని తెలిపారు. అప్రమత్తంగా లేకపోతే పలువురు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ధ్రువీకరణ పత్రాలపై సంతకాల విషయంలో కూడా గందరగోళం నెలకొన్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఒకే కుటుంబంలో యజమాని అందరి తరఫున సంతకం చేయడం, వేరే ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు అక్కడ కూడా సంతకం చేయడం వంటి అంశాలపై అధికారుల వద్ద స్పష్టమైన వివరణ లేదన్నారు. అధికారులు వచ్చిన సమయంలో అందుబాటులో లేకపోతే ఓటు తొలగించే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రతి కార్పొరేటర్ ప్రజల మధ్య ఉంటూ ఎస్ఐఆర్‌కు సంబంధించిన సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని, ఓటు హక్కు పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మాధవరం కృష్ణారావు దిశానిర్దేశం చేశారు.



## హైడ్రా చీఫ్ రంగనాథ్‌పై

# ఈటల విసుర్లు

**పేదల ఇళ్ల కూల్చివేతలపై వార్నింగ్**

**అస్మత్‌పేటలో బాధితులకు ఎంపీ పరామర్శ**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను లక్ష్యంగా చేసుకుని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ సీనియర్ నేత ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి అండ ఉందనే ధైర్యంతో ప్రజల ఇళ్లను ఇష్టానుసారంగా కూల్చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆవేదన, శాపం ఒకరోజు తప్పకుండా తాకుతుందని హెచ్చరించారు. కోర్టులు పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా, శనివారాలనే కూల్చివేతలు చేపట్టడం వెనుక ఉద్దేశం ఏమిటని ఈటల ప్రశ్నించారు. న్యాయస్థానాల పట్ల హైడ్రా అధికారులకు గౌరవం ఉందా లేదా అని నిలదీశారు. మానవత్వం ఉన్న ఏ అధికారి కూడా పేదల ఇళ్లను ఈ విధంగా కూల్చివేయరని వ్యాఖ్యానించారు.

### "పేదలపైనే ప్రతాపమా?"

భూకబ్జాదారులు, అవినీతి అధికారులపై చర్యలు తీసుకునే ధైర్యం హైడ్రాకు లేదని ఈటల ఆరోపించారు. రాజకీయ నాయకుల పేర్లు చెప్పే సాహసం చేయకుండా, నోరులేని పేద ప్రజల ఇళ్లపైనే ప్రతాపం చూపుతున్నారని మండిపడ్డారు. హైడ్రా వ్యవహారశైలి బయటి దేశం నుంచి వచ్చిన దాడి దళంలా ఉందని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం పేరుతో పేదల ఇళ్లను కూల్చడమే ప్రభుత్వ లక్ష్యమా అని ఈటల ప్రశ్నించారు. గతంలో కూడా ఇలాంటి ప్రభుత్వం ఉండి ఉంటే హైదరాబాద్‌లో బస్తీలు, పేదలకు గూళ్లు ఉండేవి కావని అన్నారు. పేదల ఆవేదనను విస్మరిస్తే ప్రభుత్వం తీవ్ర రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

### భూయాజమాన్యంపై స్పష్టత కావాలి

అస్మత్‌పేట సర్వే నంబర్-1లోని భూమిని కొందరు పురావస్తు శాఖ భూమిగా, మరికొందరు ప్రభుత్వ భూమిగా, ఇంకొందరు ప్రైవేటు భూమిగా చెబుతున్నారని ఈటల అన్నారు. అసలు అది ఎవరి భూమో తేల్చాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖదేనని పేర్కొన్నారు. విచారణ పూర్తికాకముందే ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వ భూమి అయితే లేఅవుట్ చేసినవారు ఎవరు, అమ్మిన బ్రోకర్లు ఎవరు, సహకరించిన అధికారులు, రాజకీయ నాయకులు ఎవరో గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### హైడ్రా లక్ష్యం మారిపోయిందా?

హైడ్రా ఏర్పాటైనప్పుడు చెరువులు, మురికి కాలువలు, వరద కాలువలు కాపాడుతుందని ప్రజలు భావించారని ఈటల చెప్పారు. భూకబ్జాదారులపై చర్యలు తీసుకుంటుందని ఆశించామని అన్నారు. కానీ ఇప్పుడు పేదలే లక్ష్యంగా మారారని ఆరోపించారు. భూకబ్జాదారులు, అధికారులపై చర్యలు తీసుకునే ధైర్యం లేక పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ నాయకుల పేర్లు ప్రస్తావించే సాహసం కూడా హైడ్రాకు లేదని విమర్శించారు.

# స్పీకర్ పదవి గౌరవం కాపాడండి



**అప్పుల లెక్కలపై కేటీఆర్ సవాల్**
**వికారాబాద్ వేదికగా బీఆర్ఎస్ దూకుడు**
**వికారాబాద్‌లో కార్యకర్తల సమావేశం**



వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న డిజిటల్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

వికారాబాద్ వంటి అద్భుతమైన పర్యాటక ప్రాంతాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. దామగుండంలో నేవీ రాడార్ పేరుతో లక్షలాది చెట్లను నరికివేస్తూ పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును గతంలో కాంగ్రెస్ నాయకులే కోర్టుల్లో అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అదే పార్టీ అభివృద్ధి గురించి మాట్లాడడం ఆశ్చర్యకరమని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

### స్పీకర్ వ్యాఖ్యలపై ఆగ్రహం

తెలంగాణ అప్పుల విషయంలో శాసనసభ స్పీకర్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి వాస్తవాలకు విరుద్ధంగా మాట్లాడడం సరైంది కాదని అన్నారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఆయన్నిదేనని పేర్కొన్నారు. అసత్యాలు, అర్ధసత్యాలు చెప్పడం వల్ల ఆ పదవి గౌరవం దెబ్బతింటుందని వ్యాఖ్యానించారు.

### అప్పుల లెక్కలు వివరించిన కేటీఆర్

తెలంగాణ అప్పులపై కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన గణాంకాలను కేటీఆర్ ప్రస్తావించారు. రాష్ట్ర ఆవిర్భావ సమయంలో తెలంగాణపై రూ.72 వేల కోట్ల అప్పు ఉందని గుర్తు చేశారు. 2023 డిసెంబర్ నాటికి మొత్తం అప్పు రూ.3 లక్షల 52 వేల కోట్లకు చేరిందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇచ్చిన సమాధానాన్ని ఉదహరించారు. అంటే పదేళ్లలో సుమారు రూ.2.80 లక్షల కోట్ల మేర మాత్రమే అదనపు అప్పు జరిగిందని చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.8 లక్షల కోట్లు, రూ.9 లక్షల కోట్లు అంటూ భిన్న సంఖ్యలు చెబుతోందని విమర్శించారు.

### ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం

ఒక మంత్రి ఒక లెక్క, మరో మంత్రి మరో లెక్క చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలో ఉన్నవారు అధికారిక లెక్కల ఆధారంగానే మాట్లాడాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్, కాగ్ వంటి సంస్థలు వెల్లడించిన వివరాలను విస్మరించి రాజకీయ ఆరోపణలు చేయడం తగదన్నారు. ప్రజలకు వాస్తవాలను చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

### పార్టీ బలోపేతంపై దృష్టి

బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేష్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణపై బీజేపీ ఫోకస్



**పశ్చిమ బెంగాల్ స్ఫూర్తితో పోరాటం**
**తెలంగాణలో కమలం వికసిస్తుంది**
**బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ ధీమా**
**అధికారమే లక్ష్యంగా పోరాడాలని పిలుపు**

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలని సూచించారు. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ సాధించిన పురోగతిని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలో కూడా అదే ఉత్సాహంతో ముందుకు సాగాలని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

### 9 జిల్లాల్లో పార్టీ కార్యాలయాల ప్రారంభం

ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, వనపర్తి, నాగర్‌కర్నూలు జిల్లాల్లో నూతన బీజేపీ కార్యాలయాలను నితిన్ నబీన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యాలయాలు కేవలం భవనాలు మాత్రమే కాదని, ప్రజాసేవకు అంకితమైన కేంద్రాలని పేర్కొన్నారు. "దేశమే మొదట, పార్టీ తర్వాత, స్వార్థం చివర" అనే సిద్ధాంతంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు పెంచుకుని పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని అన్నారు.

### తెలంగాణలో కమలం వికాసం

1980 నుంచి తెలంగాణలో బీజేపీ కార్యకర్తలు నిరంతరంగా ప్రజా సేవ చేస్తున్నారని నితిన్ నబీన్ అన్నారు. వారి కృషి వల్లే రాబోయే రోజుల్లో ప్రతి గ్రామం, ప్రతి వీధిలో బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. అవినీతి, అరాచక పాలనకు ముగింపు పలకడానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అండగా నిలిచే ప్రత్యామ్నాయంగా బీజేపీ నిలుస్తుందని పేర్కొన్నారు.

### తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేసిన నితిన్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీజేపీ కీలక పాత్ర పోషించిందని నితిన్ నబీన్ గుర్తు చేశారు. మాజీ విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ తెలంగాణ రాష్ట్ర సాధనకు బలంగా మద్దతు ఇచ్చారని అన్నారు. 1984లో దేశవ్యాప్తంగా బీజేపీకి కేవలం రెండు లోక్‌సభ స్థానాలు వచ్చినప్పుడు తెలంగాణ ప్రజలు పార్టీకి అండగా నిలిచారని గుర్తుచేశారు. బీజేపీ పరాయి పార్టీ కాదని, తెలంగాణ ప్రజలతో అనుబంధం ఉన్న రాజకీయ శక్తి అని వ్యాఖ్యానించారు.

### డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో అభివృద్ధి

రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడితేనే తెలంగాణ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని నితిన్ నబీన్ అన్నారు. కేంద్రం, రాష్ట్రం ఒకే దిశగా పనిచేస్తే అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల కలలు ఇంకా పూర్తిగా నెరవేరలేదని, వాటిని సాకారం చేయడానికి బీజేపీ కట్టుబడి ఉందని తెలిపారు. రాజకీయం అంటే అధికారాన్ని అనుభవించడం కాదని, అది త్యాగం, ప్రజాసేవ అని చెప్పారు.

### మున్సిపల్ ఎన్నికలపై దృష్టి

రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుందని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త ప్రజాక్షేత్రంలోకి వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి నగరాల వరకు పార్టీని విస్తరించే దిశగా కార్యాచరణ కొనసాగుతుందని చెప్పారు. తెలంగాణలో బీజేపీని మరింత బలమైన రాజకీయ శక్తిగా నిలబెట్టడమే తమ లక్ష్యమని వెల్లడించారు. ప్రజల విశ్వాసంతో రాష్ట్రంలో కమలం వికసించడం ఖాయమని నితిన్ నబీన్ ధీమా వ్యక్తం చేశారు.

# మనీ ట్రయల్‌పై సిట్ దర్యాప్తు

## రామాలయ విరాళాల కేసులో సంచలనం

## నిందితుల ఇళ్లపై సోదాలు, ఆస్తులపై ఆరా







**అ**యోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో దర్యాప్తు మరింత వేగం అందుకుంది. కేసులో అరెస్టైన ఎనిమిది మంది నిందితుల ఇళ్లలో పోలీసులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ప్రత్యేక దర్యాప్తు బృందంతో పాటు స్థానిక మేజిస్ట్రేట్లు, రెవెన్యూ అధికారులు కూడా ఈ సోదాల్లో పాల్గొన్నారు. హుండీల్లో భక్తులు సమర్పించిన నగదు దుర్వినియోగానికి సంబంధించిన డబ్బు జాడను గుర్తించడమే ఈ సోదాల ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. గత నాలుగేళ్లలో నిందితులు సంపాదించిన ఆస్తులపై పోలీసులు సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. భూములు, బంగారం, బ్యాంకు డిపాజిట్లు, ఇతర పెట్టుబడుల వివరాలను కుటుంబ సభ్యుల నుంచి తెలుసుకుంటున్నారు. నిందితుల ఇళ్ల విలువ, ఆస్తుల పెరుగుదల, పెట్టుబడుల వివరాలను కూడా పరిశీలిస్తున్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బు ఎక్కడ పెట్టుబడిగా మారిందనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

### లైఫ్ స్టైల్‌లో అనూహ్య మార్పులు

నిందితుల్లో ఒకరి కుటుంబ సభ్యురాలు పోలీసులకు ఇచ్చిన సమాచారం దర్యాప్తులో కీలకంగా మారింది. అనుకల్ప్ మిశ్రా ఆలయ ట్రస్టులో పని ప్రారంభించే ముందు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సాధారణంగానే ఉండేదని, ఆ తర్వాత జీవనశైలిలో గణనీయమైన మార్పు వచ్చిందని ఆయన మేనత్త నేహా మిశ్రా వెల్లడించినట్లు సమాచారం.

ఈ వివరాల ఆధారంగా కుటుంబ ఆదాయం, ఖర్చులు, ఆస్తుల పెరుగుదలపై అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు.

### పొరుగువారి నుంచి వివరాల సేకరణ

నిందితుల కుటుంబాల ఆర్థిక పరిస్థితిలో వచ్చిన మార్పులపై పోలీసులు పొరుగువారిని కూడా ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కొత్త వాహనాలు కొనుగోలు చేశారా, కొత్త ఇళ్లు, భూములు తీసుకున్నారా అనే వివరాలు సేకరిస్తున్నారు. ఇద్దరు నిందితుల కుటుంబాలు పోలీసు విచారణకు పూర్తిగా సహకరించలేదని సమాచారం. దీంతో వారి ఆర్థిక లావాదేవీలపై అధికారులు మరింత దృష్టి పెట్టారు.

### రూ.80 లక్షల స్వాధీనం

దర్యాప్తు వర్గాల అంచనా ప్రకారం రామాలయ హుండీల నుంచి సుమారు రూ.7 నుంచి రూ.7.5 కోట్ల వరకు నగదు దుర్వినియోగం జరిగినట్లు భావిస్తున్నారు. ఇప్పటివరకు నిందితుల నుంచి రూ.79.85 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాజా సోదాల్లో మరిన్ని నగదు, విలువైన ఆధారాలు లభించాయా అనే విషయంపై ఇంకా అధికారిక సమాచారం వెల్లడించలేదు.

### పలు చట్టాల కింద కేసులు నమోదు

ప్రాథమిక నివేదిక సమర్పించిన ప్రత్యేక దర్యాప్తు బృందం సూచనల మేరకు నిందితులపై దొంగతనం, నేరపూరిత విశ్వాసభంగం, దొంగిలించిన ఆస్తి స్వీకరణ, నేర కుట్ర, అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనల కింద కేసులు నమోదు చేశారు. హుండీల నగదు లెక్కింపులో పనిచేసిన సిబ్బందే ఈ కేసులో అరెస్టు కావడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. డబ్బు జాడ పూర్తిగా వెలికితీసే వరకు దర్యాప్తు కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# దేవుడే చట్టబద్ధ యజమాని

## విరాళాలపై కీలక వివరణ

## కేసులో న్యాయపరమైన కోణం

**అ**యోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసు ఇప్పుడు కేవలం ఆర్థిక అక్రమాలకే పరిమితం కాకుండా కీలక న్యాయపరమైన చర్చకు దారితీసింది. భక్తులు సమర్పించిన నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులు ఆలయ ట్రస్టుకు చెందినవి కాదని, చట్టపరంగా అవి ఆలయ దేవతకు చెందిన ఆస్తిగా పరిగణించబడతాయని న్యాయ నిపుణులు గుర్తు చేస్తున్నారు. హిందూ దేవతను చట్టం ముందు ప్రత్యేక న్యాయ వ్యక్తిగా గుర్తించిన నేపథ్యంలో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

### దేవతకు ప్రత్యేక న్యాయ హోదా

అనాధిగా ఉన్న అత్యున్నత అప్పీల్ కోర్టు కాలం నుంచి నేటి సుప్రీంకోర్టు వరకు వచ్చిన పలు తీర్పులు హిందూ దేవతను చట్టబద్ధ వ్యక్తిగా గుర్తించాయి. దేవత పేరిట విరాళాలు స్వీకరించే హక్కు, ఆస్తులు కలిగి ఉండే హక్కు చట్టపరంగా ఉంటుందని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. భక్తులు సమర్పించే విరాళాలు దేవతకే అంకితమవుతాయని, వాటిపై యాజమాన్య హక్కు కూడా దేవతకే ఉంటుందని తీర్పుల్లో స్పష్టం చేశారు.

### ట్రస్టు కేవలం నిర్వాహక సంస్థ మాత్రమే

ఆలయ ట్రస్టు లేదా నిర్వాహకులు ఆస్తుల యజమానులు కాదని న్యాయ తీర్పులు స్పష్టం చేశాయి. వారు కేవలం ఆస్తులను నిర్వహించే బాధ్యత మాత్రమే వహిస్తారని పేర్కొన్నాయి. భక్తులు సమర్పించిన విరాళాలపై పూర్తి యాజమాన్య హక్కు దేవతకే ఉంటుందని సుప్రీంకోర్టు పలుమార్లు తేల్చి చెప్పింది. అందువల్ల ఆలయ నిధుల నిర్వహణలో ఉన్న ప్రతి వ్యక్తిపై మరింత బాధ్యత ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

### చట్టబద్ధమైన మైనర్ హోదా

సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన కీలక తీర్పుల్లో దేవతను చట్టపరంగా మైనర్‌తో సమానంగా పరిగణించింది. మైనర్ ఆస్తులను ఎలా రక్షిస్తారో, దేవత ఆస్తులను కూడా అదే విధంగా రక్షించాలని న్యాయస్థానం పేర్కొంది. దేవత ప్రయోజనాలకు విఘాతం కలిగితే భక్తులు కూడా కోర్టును ఆశ్రయించే హక్కు ఉంటుందని విస్పష్టంగా చెప్పింది. దేవత తరఫున వ్యవహరించే నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని న్యాయస్థానం వివరించింది.

### పద్మనాభస్వామి తీర్పు ప్రస్తావన

కేరళలోని శ్రీ పద్మనాభస్వామి ఆలయానికి సంబంధించిన చారిత్రాత్మక కేసులో కూడా సుప్రీంకోర్టు ఇదే సూత్రాన్ని పునరుద్ఘాటించింది. భక్తులు సమర్పించే విరాళాలు పూర్తిగా దేవతకు చెందుతాయని తీర్పులో స్పష్టం చేసింది. రాజు మార్తాండ వర్మ తన రాజ్యాన్ని దేవతకు అంకితం చేసిన చారిత్రక విషయాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. ఈ తీర్పు దేవతను ప్రత్యేక న్యాయ వ్యక్తిగా గుర్తించే సంప్రదాయానికి బలమైన ఆధారంగా నిలిచింది.



### రామాలయ కేసులో పెరిగిన ప్రాధాన్యం

అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో ఈ న్యాయ సూత్రాలు కీలకంగా మారే అవకాశం ఉంది. భక్తులు విశ్వాసంతో సమర్పించిన ప్రతి రూపాయి దేవత ఆస్తిగానే పరిగణించబడుతుందని న్యాయపరమైన అభిప్రాయం ఉంది. అందువల్ల విరాళాల దుర్వినియోగంపై నమోదైన ఆరోపణలు సాధారణ ఆర్థిక నేరాలుగా కాకుండా చట్టపరంగా ప్రత్యేక ప్రాధాన్యం కలిగిన అంశాలుగా పరిగణించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతుండగా, ఆలయ నిధుల నిర్వహణ, బాధ్యుల పాత్ర, చట్టపరమైన బాధ్యతలపై మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఫామ్‌హౌస్ నుంచి స్కార్పియో వరకు

# రామాలయ విరాళాల కేసులో షాక్

## దోషుల విలాసవంతమైన జీవితం

## దర్యాప్తులో వెలుగులోకి కొత్త వివరాలు

**అ**యోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో అరెస్టైన నిందితుల జీవనశైలిపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్న అనుకల్ప్ మిశ్రా జీవితం కొద్ది సంవత్సరాల్లోనే పూర్తిగా మారిపోయిందని విచారణలో వెల్లడైంది. ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన నగదు, విలువైన వస్తువుల లెక్కింపు బృందంలో పనిచేసిన ఆయనపై ప్రస్తుతం ఆర్థిక లావాదేవీలతో పాటు ఆస్తుల పెరుగుదలపై కూడా విచారణ కొనసాగుతోంది.

### బావను కూడా అదే బృందంలోకి

అనుకల్ప్ మిశ్రా తన బావ లవ్‌కుష్ మిశ్రాను కూడా ఆలయ విరాళాల లెక్కింపు బృందంలో నియమించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు దర్యాప్తులో తేలింది. బ్యాంకు ఔట్‌సోర్సింగ్ సంస్థ ద్వారా ఇద్దరూ ఒకే బృందంలో పనిచేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ఇద్దరూ కేసులో అరెస్టైన ఎనిమిది మందిలో ఉన్నారు. విరాళాల నగదు దుర్వినియోగానికి సంబంధించిన కీలక సమాచారం వీరి ద్వారా లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

### విలాసవంతమైన జీవనశైలి

అనుకల్ప్ స్వగ్రామంలో ఆయన ఇంటి నిర్మాణం, జీవనశైలి స్థానికుల దృష్టిని ఆకర్షించినట్లు సమాచారం. ఒకప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబం ఇప్పుడు విలాసవంతమైన జీవితం గడుపుతోందని గ్రామస్థులు పోలీసులకు వెల్లడించినట్లు తెలుస్తోంది. గ్రామ శివారులో ఫామ్‌హౌస్ నిర్మించడం, గత ఏడాది అయోధ్యలో సుమారు రూ.65 లక్షల విలువైన ఇల్లు కొనుగోలు చేయడం, కొత్త స్కార్పియో వాహనం బుక్ చేసినట్లు బయటపడింది. ఈ ఆస్తుల కొనుగోళ్లపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

### మత కార్యక్రమంపై కూడా విచారణ

ఈ ఏడాది ఏప్రిల్ 30న గ్రామంలో ఏడు రోజులపాటు భారీ మత కార్యక్రమాన్ని అనుకల్ప్ నిర్వహించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కార్యక్రమానికి రామాలయ ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ సహా పలువురు ప్రముఖులు హాజరైనట్లు ఫొటోలు బయటకు వచ్చాయి. ఇంత భారీ కార్యక్రమానికి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయనే అంశంపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కార్యక్రమ నిర్వహణకు ఉపయోగించిన డబ్బు మూలాలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

### ఇతర నిందితుల ఆస్తులపైనా దృష్టి

లవ్‌కుష్ మిశ్రా కూడా ఇటీవల లక్ష రూపాయలకు పైగా విలువైన మోటార్ సైకిల్ కొనుగోలు చేసినట్లు స్థానికులు తెలిపారు. కేసులో అరెస్టైన మిగిలిన నిందితుల ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. అక్రమంగా సంపా దించిన డబ్బు ఎక్కడ పెట్టుబడిగా మారింది, ఎవరి పేర్లపై ఆస్తులు కొనుగోలు చేశారు అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

### డబ్బు ఎక్కడన్నదానిపై విచారణ

రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో డబ్బు జాడను గుర్తించడం ఇప్పుడు దర్యాప్తులో ప్రధాన లక్ష్యంగా మారింది. నిందితుల ఆస్తులు, కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి, ఇటీవలి కొనుగోళ్లు, బ్యాంకు లావాదేవీలు అన్నింటినీ అధికారులు పరిశీలిస్తున్నారు. విలాసవంతమైన జీవనశైలి ఈ కేసులో కీలక ఆధారంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. దర్యాప్తు పూర్తయ్యే కొద్దీ మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఉపాధి హామీ చట్టంపై

# కాంగ్రెస్ ధ్వజం

## రాష్ట్రాలపై కొత్త భారం అంటూ విమర్శలు

## కొత్త చట్టంపై హస్తం పార్టీ అభ్యంతరాలు

**కేం**ద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తీసుకొస్తున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్, గ్రామీణ చట్టంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ కొత్త చట్టం గ్రామీణ ప్రజలకు ప్రయోజనం కలిగించే బదులు అధికారాల కేంద్రీకరణకు దారితీస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. రాష్ట్రాల ఆర్థిక భారం మరింత పెరిగే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అన్నారు.

### సంప్రదింపులు లేకుండానే చట్టం

ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే ముందు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ గ్రామీణాభివృద్ధి స్థాయీ సంఘం, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వాములతో సమగ్ర చర్చలు జరపలేదని జైరాం రమేశ్ విమర్శించారు. తగిన సంప్రదింపులు లేకుండానే చట్టాన్ని పార్లమెంట్ ద్వారా ఆమోదింపజేశారని ఆరోపించారు. జూలై 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త చట్టంపై ఇప్పుడు అనేక రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు.

### బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచే అభ్యంతరాలు

మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ చట్టంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని కాంగ్రెస్ తెలిపింది. కొత్త విధానం అమలుతో రాష్ట్రాలపై భారీ అదనపు వ్యయం పడుతుందని ఆయా రాష్ట్రాలు అభిప్రాయపడినట్లు జైరాం రమేశ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై స్వంత పార్టీ పాలిత రాష్ట్రాల నుంచే ప్రశ్నలు రావడం గమనార్హమని ఆయన వ్యాఖ్యానించారు.

### వ్యవసాయ కాలంపై ఆందోళన

పీక్ వ్యవసాయ కాలంలో ఉపాధి పథకానికి బ్లాక్‌అవుట్ వ్యవధి ఉండడాన్ని మరో నాలుగు రాష్ట్రాలు వ్యతిరేకించినట్లు కాంగ్రెస్ తెలిపింది. గ్రామీణ కార్మికులకు చెల్లించే వేతనాలను పెంచాలని కనీసం ఐదు రాష్ట్రాలు కోరినట్లు వెల్లడించింది. గ్రామీణ ఉపాధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త చట్టంలో మార్పులు చేయాలని రాష్ట్రాలు సూచిస్తున్నాయని పేర్కొంది.

### ఉపాధి హక్కు బలహీనమవుతుందా?

పాత ఉపాధి హామీ చట్టం రాజ్యాంగ స్ఫూర్తితో గ్రామీణ కుటుంబాలకు పని హక్కును కల్పించిందని కాంగ్రెస్ పేర్కొంది. కొత్త చట్టం మాత్రం అధికారాలను కేంద్రం వద్దే కేంద్రీకరిస్తుందని విమర్శించింది. గ్రామీణ కార్మికుల బేరసారాల శక్తి తగ్గే ప్రమాదం ఉందని కూడా ఆరోపించింది. ఈ చట్టం ద్వారా రాష్ట్రాల స్వతంత్ర నిర్ణయాధికారం బలహీనపడుతుందని కాంగ్రెస్ అభిప్రాయపడింది.



### జూలై 1 నుంచి కొత్త విధానం

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్, గ్రామీణ చట్టం జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది. రెండు దశాబ్దాలుగా అమలులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ఇది ప్రత్యామ్నాయంగా ఉంటుంది. కొత్త చట్టం ప్రకారం గ్రామీణ కుటుంబాలకు ఏడాదికి 125 రోజుల చట్టబద్ధ వేతన ఉపాధి కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే రాష్ట్రాల అభ్యంతరాలు, కాంగ్రెస్ విమర్శల నేపథ్యంలో ఈ కొత్త విధానం రాజకీయ చర్చకు దారితీసింది.



# రక్షణ రంగంలో కొత్త శకం

## సముద్రం నుంచి ఆకాశం వరకు

## స్వావలంబన దిశగా భారత్ పయనం

## 'మన్ కీ బాత్'లో ప్రధాని సందేశం

ప్రధాని నరేంద్ర మోదీ తన నెలవారీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో దేశం సాధించిన కీలక విజయాలను ప్రస్తావించారు. సముద్రం నుంచి ఆకాశం వరకు భారత్ మరింత భద్రంగా, స్వావలంబనతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. జూన్ నెలలో రక్షణ, విమానయాన రంగాల్లో నమోదైన విజయాలు ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. స్వదేశీ సాంకేతికత ఆధారంగా దేశం కొత్త మైలురాళ్లు చేరుకుంటోందని వివరించారు.

### సీ-295 విమానంతో కొత్త అధ్యాయం

భారత్‌లోనే తయారైన సీ-295 సైనిక రవాణా విమానం తొలి విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేయడం చారిత్రాత్మక ఘట్టమని ప్రధాని తెలిపారు. ప్రస్తుతం ఇలాంటి 40 విమానాలను దేశంలోనే తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు. ఏరోస్పేస్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఈ తయారీ ప్రక్రియతో ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతాయని వివరించారు.

### స్వదేశీ క్షిపణితో రక్షణ బలోపేతం

రక్షణ పరిశోధన సంస్థ డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన దీర్ఘ శ్రేణి భూదాడి క్రూయిజ్ క్షిపణి విజయవంతమైన పరీక్ష కూడా దేశానికి మరో గొప్ప విజయమని ప్రధాని పేర్కొన్నారు. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఈ క్షిపణి భారత్ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. దేశ భద్రత విషయంలో స్వదేశీ పరిశోధన ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో ఐఎన్‌ఎస్ దునగిరి, ఐఎన్‌ఎస్ శంశాక్, ఐఎన్‌ఎస్ అగ్రయ నౌకలను భారత నౌకాదళంలో చేర్చిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. ఈ యుద్ధ నౌకల రూపకల్పన నుంచి తయారీ వరకు ప్రతి దశ స్వదేశీ సామర్థ్యంతో పూర్తయిందని చెప్పారు. సముద్ర రక్షణలో కూడా భారత్ వేగంగా స్వయం సమృద్ధి సాధిస్తోందని తెలిపారు.

### సేంద్రీయ వ్యవసాయం - కృత్రిమ మేధ

రసాయన రహిత వ్యవసాయాన్ని రైతులు విస్తృతంగా స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. సహజ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. మరోవైపు యువతకు ఆధునిక సాంకేతిక విద్యను అందించేందుకు ఢిల్లీలోని కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయం కృత్రిమ మేధ, డేటా సైన్స్‌లో బీటెక్ కోర్సును ప్రారంభించడం మంచి పరిణామమని అన్నారు. సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించే దిశగా ఇది కీలక అడుగని పేర్కొన్నారు.

### సంస్కృతి, పర్యావరణం, క్రీడలకు ప్రాధాన్యం

భారతీయ సంస్కృతి ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోందని ప్రధాని వివరించారు. డొమినికన్ రిపబ్లిక్‌లో స్థానికులు వేద సాహిత్యాన్ని అభ్యసించడం ఆనందదాయకమని చెప్పారు. అసోంలో హర్గిలా పక్షి పరిరక్షణకు మహిళలు చేసిన కృషిని ప్రశంసించారు. నాగాలాండ్‌లో చిన్నారుల కోసం ప్రారంభించిన ఫుట్‌బాల్ లీగ్ క్రీడలకు ప్రోత్సాహంగా నిలుస్తుందని అన్నారు. మేఘాలయలోని సహజ వేరు వంతెనలను ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే గణేష్ ఉత్సవాల సందర్భంగా స్వదేశీ మట్టితో స్థానిక కళాకారులు తయారు చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే కొనుగోలు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇది స్థానిక కళాకారులకు ప్రోత్సాహం కలిగించడమే కాకుండా స్వదేశీ ఉత్పత్తులకు బలం చేకూరుస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# స్వదేశానికి తిరిగి వెళ్తా!

## షేక్ హసీనా ప్రకటనతో కలకలం

## బంగ్లా రాజకీయాల్లో ఉత్కంఠ

## ఈ ఏడాదే కొత్త ప్రయాణం షురూ

**బం**గ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మరోసారి కీలక ప్రకటన చేశారు. అన్ని అడ్డంకులను అధిగమించి ఈ ఏడాదే స్వదేశానికి తిరిగి వస్తానని ప్రకటించారు. ప్రస్తుతం ప్రవాసంలో ఉన్న ఆమెపై మరణశిక్ష విధించబడిన పరిస్థితి ఉన్నప్పటికీ వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. తన స్వదేశానికి తిరిగి వెళ్లడం వ్యక్తిగత ఆశయం కాదని, ప్రజాస్వామ్య హక్కుల పునరుద్ధరణ కోసం జరుగుతున్న పోరాటంలో భాగమని పేర్కొన్నారు. ఆమె ప్రకటనతో బంగ్లాదేశ్ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది.

### ఆవామీ లీగ్‌పై నమ్మకం

ఆవామీ లీగ్ కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని, ప్రజల బలంతో ఎదిగిన శక్తి అని హసీనా పేర్కొన్నారు. గతంలో ఎన్నో నిషేధాలు, నిర్బంధాలు ఎదురైనా ప్రతి సారి పార్టీ మరింత బలంగా తిరిగి వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం పార్టీపై నిషేధం కొనసాగుతున్నా ప్రజల మద్దతు తగ్గలేదని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల అండతో ఆవామీ లీగ్ మరోసారి పుంజుకుంటుందని అన్నారు. ప్రస్తుత బంగ్లాదేశ్ పాలనపై షేక్ హసీనా తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం, న్యాయ పాలన బలహీనపడిందని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందని, శాంతిభద్రతలు క్షీణించాయని వ్యాఖ్యానించారు. మైనార్టీలపై దాడులు పెరిగాయని, తీవ్రవాదానికి అవకాశం లభించిందని అన్నారు. దేశాన్ని మళ్లీ స్థిరత్వం దిశగా తీసుకెళ్లే శక్తి ఆవామీ లీగ్‌కే ఉందని ఆమె పేర్కొన్నారు.

### మైనార్టీల భద్రతపై ఆందోళన

బంగ్లాదేశ్‌లో హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులు, ఇతర మైనార్టీ వర్గాలపై జరుగుతున్న దాడులపై హసీనా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయాలపై దాడులు, మతపరమైన వేధింపులు, మహిళలపై హింస వంటి ఘటనలు పెరిగాయని ఆరోపించారు. మైనార్టీలపై దాడి అంటే బంగ్లాదేశ్ స్వాతంత్ర్య స్ఫూర్తిపైనే దాడి చేసినట్లేనని వ్యాఖ్యానించారు. ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. తనపై నమోదైన కేసులు రాజకీయ కక్షసాధింపు ఫలితమేనని హసీనా ఆరోపించారు. న్యాయవ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని విమర్శించారు. ఆవామీ లీగ్‌పై నిషేధం ఎత్తివేయాలని, తప్పుడు కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు జరిగితే ఆవామీ లీగ్ విజయం సాధిస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

### తిరిగి వస్తాననే ప్రకటనతో రాజకీయంగా ట్విస్టులు

ప్రస్తుతం భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న షేక్ హసీనా, బంగ్లాదేశ్ ప్రజలతో తన బంధం ఎప్పటికీ కొనసాగుతుందని చెప్పారు. దేశ ప్రజల హక్కుల కోసం తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ ఏడాదే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తానన్న ఆమె ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.







# భక్తులకు దివ్య దర్శనం



**స్వర్ణ కవచంలో మలయప్పస్వామి**

**వైభవంగా ముగిసిన జ్యేష్ఠాభిషేకం**

**ముగిసిన 3 రోజుల మహోత్సవం**

తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జ్యేష్ఠాభిషేక మహోత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణ కవచంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. ఇక వచ్చే జ్యేష్ఠాభిషేకం వరకు సంవత్సరం పొడవునా ఉభయ దేవేరులతో కలిసి స్వామివారు ఈ బంగారు కవచంతోనే దర్శనమివ్వనున్నారు. ఈ దృశ్యాన్ని దర్శించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఉభయనాంచారులతో కలిసి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేశారు. ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి, దేవేరులకు స్నపన తిరుమంజనం నిర్వహించి స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవలో స్వామివారు స్వర్ణ కవచంలో భక్తులకు దర్శనమిచ్చారు. తర్వాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# జర పైలం

**మీకు మీ ఊళ్లో, హైదరాబాద్‌లోనూ ఓటుందా?**

**ఐతే ఇక మీరు డేంజర్‌లో ఉన్నట్టే!**

**సర్ సోదాల్లో బయటపడుతున్న ఓట్ల కహానీలు**

**రెండు చోట్ల ఓట్లుంటే ఇక అంతే సంగతులు..**

**అప్రమత్తం చేస్తున్న ఎన్నికల అధికారులు**



ఓటు హక్కు ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు. అయితే హక్కుతో పాటు బాధ్యత కూడా ఉంటుందనే విషయాన్ని చాలామంది విస్మరిస్తున్నారు. ఉద్యోగం, చదువు, నివాస మార్పు కారణంగా కొత్త చోట ఓటు నమోదు చేసుకున్న తర్వాత పాత చోట పేరును తొలగించకుండా వదిలేస్తే అది చట్టపరమైన సమస్యగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సర్వే నేపథ్యంలో రెండు చోట్ల ఓటు నమోదు ఉన్న వారిపై ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఏఐ ఆధారిత పరిశీలనతో డూప్లికేట్ నమోదులు సులభంగా గుర్తించే పరిస్థితి వచ్చింది. ఒకే వ్యక్తికి ఒకే ఓటు అనే ప్రజాస్వామ్య సూత్రాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. నిర్లక్ష్యం చేస్తే నోటీసులు, విచారణ, జరిమానా, జైలు శిక్ష వంటి పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే ప్రతి ఓటరు తన ఓటు నమోదు వివరాలను వెంటనే పరిశీలించి, అవసరమైతే పాత నమోదును తొలగించాలి. హక్కును సక్రమంగా వినియోగించడమే కాదు, చట్టాన్ని గౌరవించడం కూడా ప్రతి పౌరుడి కర్తవ్యమే.

- 5లో...

## ఇంటింటికీ ఈసీ...భారీ కసరత్తు

**ఓటర్ల ధృవీకరణ వేగవంతం**

రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను ఎన్నికల సంఘం మరింత వేగవంతం చేసింది. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్న సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు 1.43 కోట్లకు పైగా ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయగా, అందులో 42.33 శాతం పూర్తయ్యింది. మిగిలిన ఓటర్లకు కూడా త్వరలోనే ఫారాలు అందించాలని ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది.

## ఆంధ్రుల కలల ప్రాజెక్టు పోలవరం సుదీర్ఘ ప్రయాణం



## ఒడిదుడుకులు దాటి ముందుకు పోలవరం

**నిర్వాసితుల కష్టాలు... అందని పూర్తి పరిహారం**

**సర్వస్వం త్యాగం చేసి గిరిజనుల నిరీక్షణ**

తెలుగు రాష్ట్రాలలో వ్యవసాయ రంగం ఎక్కువగా నదుల నుంచి వచ్చే నీటిపైనే ఆధారపడుతుంది. ముఖ్యంగా కృష్ణా, గోదావరి నదుల నీరు ఇక్కడి రైతులకు ప్రధాన జీవన వనరుగా నిలుస్తోంది. కృష్ణా నదిపై ఇప్పటికే శ్రీశైలం డ్యామ్, నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజ్ వంటి పెద్ద ప్రాజెక్టులు నిర్మించారు. కానీ గోదావరి నదిపై ఆ స్థాయిలో పెద్ద డ్యామ్‌లు నిర్మించలేదు. దీనివల్ల ప్రతి ఏటా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎంతో ఉపయోగపడే గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. ఇలా వృథాగా పోతున్న గోదావరి నీటిలోని ప్రతి బొట్టును ఒడిసి పట్టి, ప్రజలకు అందించాలనే బలమైన సంకల్పంతోనే పోలవరం ప్రాజెక్టు ఆలోచన రూపుదిద్దుకుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం దశాబ్దాల సుదీర్ఘ చరిత్రను కలిగి ఉంది. జీవనది గోదావరి ప్రయాణంలాగే ఈ ప్రాజెక్టు ప్రయాణంలోనూ ఎన్నో మలుపులు చోటు చేసుకున్నాయి. గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన ఈ అతిపెద్ద పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌కు వరప్రదాయినిగా భావిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సాగునీరు, తాగునీరు ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయి.

- 7లో...



## మాయా మహల్..

# కాగితాలపై పుట్టిన ఇల్లు!




**సర్వే నంబర్ మార్పు వెనుక దాగిన నిజాలు**

**పాత ఊరు కొత్త రికార్డుల మర్మమేంటి?**

**పరిశీలన లేకుండానే లక్షల బ్యాంకు రుణం**

ఒక ఇల్లు కట్టాలంటే పునాది కావాలి. గోడలు కావాలి. పైకప్పు కావాలి. కానీ ఇప్పుడు అవేమీ అవసరం లేదేమో! కాగితాలపై ఇల్లు పుడితే చాలు... రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది... లక్షల రూపాయల రుణం కూడా చేతికొస్తుంది. ఇది సినిమా కథ కాదు. వ్యవస్థలోని బలహీనతలను, అధికార యంత్రాంగంలో దాగి ఉన్న ప్రమాదకర లోపాలను ప్రశ్నించే వాస్తవ కథ.

- 6లో...

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై 1 నుంచి 5వ తేదీ వరకు వరుసగా పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ ఐదు రోజుల పర్యటనలో సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేపట్టనున్నారు. పర్యటించే జిల్లాల్లోనే రాత్రి బస చేస్తూ స్థానిక కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.



# బాబు బిజీ.. బిజీ..

**వరుస అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం**

**ఐదు రోజుల జిల్లా పర్యటనల హోరు**

**జూలై తొలి వారం బిజీ షెడ్యూల్**

- 5లో...

## అమరావతిలో ప్రజా తిరుగుబాటుతో

# వైసీపీ వెనక్కి..

**కుట్ర రాజకీయాలు సాగవన్న మంత్రి గొట్టిపాటి**



అమరావతిలో జరిగిన పరిణామాలపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రంగా స్పందించారు. ప్రజా తిరుగుబాటు ఎదుట వైసీపీ వెనక్కి తగ్గిందని అన్నారు. కుట్ర రాజ కీయాల పేరుతో మరోసారి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన వైసీపీ నాయకులకు మహిళలు, రైతులే గట్టి సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. అమరావతిలో జరిగిన పరిణామాలు ప్రజల మనోభావాలను స్పష్టంగా ప్రతిబింబించాయని వ్యాఖ్యానించారు.

- 5లో...



# 'ట్రిపుల్ ఏటీఎం'గా అమరావతి

**కూటమి ప్రభుత్వంపై అంబటి ఆరోపణలు**

- 5లో...

గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్సార్సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అమరావతి పేరుతో భారీ ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో పోలవరం ప్రాజెక్టును ఏటీఎంలా ఉపయోగించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇప్పుడు అమరావతిని "ట్రిపుల్ ఏటీఎం"గా మార్చారని వ్యాఖ్యానించారు. రూ.47 వేల కోట్ల అప్పులతో రాజధాని పేరుతో భారీ దోపిడీ జరుగుతోందని ఆరోపించారు.

# రెండేళ్ల నమ్మకమే నినాదం

**అభివృద్ధి, సంక్షేమమే అజెండా**

**పశ్చిమలో ఘనంగా విజయోత్సవ సభ**

ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" పేరుతో విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు.

- 5లో...






# పుణె వ్యాపారి హత్య కేసులో మలుపు..

**10 గంటల డిజిటల్ మాయాజాలం?..**

**తప్పించుకునే విశ్వ ప్రయత్నం!**

**ప్రేమ వ్యవహారమే హత్యకు కారణం?**

పుణెకు చెందిన వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసులో దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో చేతన్ చౌదరి, సియా గోయల్ కలిసి ముందస్తు ప్రణాళికతో హత్యకు కుట్ర పన్నినట్లు దర్యాప్తు వర్గాలు అనుమానిస్తున్నాయి. కుటుంబం కుదిర్చిన వివాహాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో ఈ హత్య జరిగిందని ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం.

- 5లో...

## ప్రేమ, పెళ్లి, హత్య కుట్ర

**మూడేళ్ల స్నేహం కోసమేనా?**




# జనసైనికులకు గుర్తింపు ఎప్పుడు?

**పదవులపై పెరుగుతున్న అసంతృప్తి**

**పార్టీ కోసం శ్రమించిన వారిలో ఆవేదన**

కాకినాడ జిల్లా గొల్లప్రోలు, పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు దక్కడం లేదనే అసంతృప్తి పెరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విజయం కోసం అహర్నిశలు శ్రమించిన జనసైనికులకు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి, పైరవీల ద్వారా అవకాశాలు పొందిన వారికి పార్టీ పదవులు లభిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- 5లో...

## ఆర్థిక ఇబ్బందులున్నా...

# సంక్షేమమే లక్ష్యం

**రెండేళ్లలో అందరికీ ఇళ్లు: మంత్రి నారాయణ**



రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అత్యంత క్లిష్టంగా ఉందని మంత్రి నారాయణ అన్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎలాంటి వెనుకడుగు వేయడం లేదని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి పెట్టిందని చెప్పారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగు తున్నాయని పేర్కొన్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేటలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు.

- 5లో...

# బాబు బిజీ బిజీ

### వరుస అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం
### ఐదు రోజుల జిల్లా పర్యటనల హోరు
### జూలై తొలి వారం బిజీ షెడ్యూల్



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై 1 నుంచి 5వ తేదీ వరకు వరుసగా పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ ఐదు రోజుల పర్యటనలో సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేపట్టను న్నారు. పర్యటించే జిల్లాల్లోనే రాత్రి బస చేస్తూ స్థానిక కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.

**నెల్లూరు, శ్రీ సిటీలో తొలి రోజు కార్యక్రమాలు**

జూలై 1న నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీ సిటీలో హీరో మోటోకార్ప్ సంస్థ ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు. సుమారు రూ.750 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తొలి రోజు పర్యటన అనంతరం శ్రీ సిటీలోనే ముఖ్యమంత్రి బస చేయనున్నారు. జూలై 2న తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అదే రోజు సాయంత్రం తిరుపతిలో నిర్వహించే జీఎస్‌డీపీ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. ఈ సమావేశానికి నీతి ఆయోగ్ సభ్యులు, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ప్రతినిధులు హాజరు కానున్నారు. ఆ రోజు రాత్రి కూడా తిరుపతిలోనే బస చేయనున్నారు.

**రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు శ్రీకారం**

జూలై 3న కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లెలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు రాయలసీమ పారిశ్రామికాభివృద్ధికి కీలకంగా మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది. కార్యక్రమం అనంతరం కుప్పంకు బయలుదేరనున్నారు. జూలై 3 నుంచి 5వ తేదీ వరకు కుప్పంలో ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారు.

## అమరావతిలో ప్రజా తిరుగుబాటుతో వైసీపీ వెనక్కి

**కుట్ర రాజకీయాలు సాగవన్న మంత్రి గొట్టిపాటి**

అమరావతిలో జరిగిన పరిణామాలపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రంగా స్పందించారు. ప్రజా తిరుగుబాటు ఎదుట వైసీపీ వెనక్కి తగ్గిందని అన్నారు. కుట్ర రాజకీయాల పేరుతో మరోసారి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన వైసీపీ నాయకులకు మహిళలు, రైతులే గట్టి సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. అమరావతిలో జరిగిన పరిణామాలు ప్రజల మనోభావాలను స్పష్టంగా ప్రతిబింబించాయని వ్యాఖ్యానించారు. అమరావతి మహిళలు, రైతులు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేయడంతో వైసీపీ నాయకులు వెనక్కి వెళ్లాల్సి వచ్చిందని మంత్రి అన్నారు. ప్రజల అభిప్రాయాలను విస్మరించి రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరించే వారిని ప్రజలే నిలదీస్తున్నారని పేర్కొన్నారు. కుట్రల రాజకీయాలను ప్రజలు ఇక సహించబోరనే సంకేతం ఈ ఘటనతో స్పష్టమైందని అభిప్రాయపడ్డారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో 3 రాజధానుల పేరుతో వైసీపీ ప్రజలను మభ్యపెట్టిందని మంత్రి ఆరోపించారు. ప్రచారం తప్ప అభివృద్ధి దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదని విమర్శించారు. అమరావతిలో గుప్పెడు మట్టి కూడా వేయకుండా కాలయాపన చేశారని అన్నారు. ఆ విధానాల వల్ల అమరావతితో పాటు రాష్ట్ర అభివృద్ధి కూడా దెబ్బతిందని ఆరోపించారు.

## ఆర్థిక ఇబ్బందులున్నా... సంక్షేమమే లక్ష్యం

**రెండేళ్లలో అందరికీ ఇళ్లు: మంత్రి నారాయణ**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అత్యంత క్లిష్టంగా ఉందని మంత్రి నారాయణ అన్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎలాంటి వెనుకడుగు వేయడం లేదని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి పెట్టిందని చెప్పారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేటలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అనేక పథకాలకు అవసరమైన నిధులను సమీకరిస్తున్నామని చెప్పారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్రం నుంచి 50 శాతం వరకు నిధులు పొందుతున్నామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సహకారం కీలకంగా మారిందని పేర్కొన్నారు. కాగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత పార్టీ నాయకులపై ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

## పుణె వ్యాపారి హత్య కేసులో మలుపు

**10 గంటల డిజిటల్ మాయాజాలం?.. తప్పించుకునే విశ్వ ప్రయత్నం!**

**ప్రేమ వ్యవహారమే హత్యకు కారణం?**

పుణెకు చెందిన వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసులో దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో చేతన్ చౌదరి, సియా గోయల్ కలిసి ముందస్తు ప్రణాళికతో హత్యకు కుట్ర పన్నినట్లు దర్యాప్తు వర్గాలు అనుమానిస్తున్నాయి. కుటుంబం కుదిర్చిన వివాహాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో ఈ హత్య జరిగిందని ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ ఇచ్చిన ఫిర్యాదులో కూడా ఇద్దరూ కలిసి లోహగడ్ కోట వద్ద నుంచి కుమారుడిని లోయలోకి తోసివేశారని ఆరోపించారు.

**డిజిటల్ జాడ లేకుండా వ్యూహం**

దర్యాప్తు ప్రకారం చేతన్ చౌదరి తన ఆనవాళ్లు కనిపించకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేసినట్లు తెలుస్తోంది. ఉదయం నుంచే మొబైల్ డేటాను నిలిపివేసి తన ప్రయాణానికి సంబంధించిన డిజిటల్ సమాచారం నమోదు కాకుండా చూసుకున్నట్లు అధికారులు గుర్తించారు. తన మొబైల్ ఫోన్‌ను దుకాణంలోనే ఉంచి, వచ్చే ఫోన్ కాల్స్‌కు ఉద్యోగులతో సమాధానాలు చెప్పించినట్లు విచారణలో వెల్లడైంది. తాను ఎక్కడికీ వెళ్లలేదనే భావన కలిగించడమే ఈ వ్యూహం ఉద్దేశమని అధికారులు భావిస్తున్నారు.

**సీసీటీవీతో బయటపడిన వ్యూహం**

సుమారు పది గంటలకుపైగా మొబైల్ ఇంటర్నెట్‌ను పూర్తిగా నిలిపివేసిన తర్వాత చేతన్ మళ్లీ ఆన్ చేసినట్లు అధికారులు గుర్తించారు. అయితే ఇదే చర్య దర్యాప్తులో అనుమానాలకు కారణమైంది. వేసవి కాలంలో మందపాటి హూడీ ధరించి కోట వద్ద సంచరించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయి. అతని ఫోన్‌కు వచ్చిన కాల్స్‌కు మరొకరు సమాధానం ఇచ్చినట్లు కూడా పోలీసులు నిర్ధారించినట్లు సమాచారం.

# జర పైలం

**మీకు మీ ఊళ్లో, హైదరాబాద్‌లోనూ ఓటుందా?**

**ఐతే ఇక మీరు డేంజర్‌లో ఉన్నట్టే!**
**సర్ సోదాల్లో బయటపడుతున్న ఓట్ల కహానీలు**
**రెండు చోట్ల ఓట్లుంటే ఇక అంతే సంగతులు..**
**అప్రమత్తం చేస్తున్న ఎన్నికల అధికారులు**

ఒక వ్యక్తి రెండు ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకోవడం చిన్న విషయం కాదని ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సర్వే, సర్‌లో రెండు చోట్ల ఎన్యూమరేషన్ పత్రాలు నింపితే భవిష్యత్తులో నోటీసులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఒకే వ్యక్తి రెండు నియోజకవర్గాల్లో ఓటరుగా కొనసాగడం భారత ఎన్నికల చట్టాలకు విరుద్ధమని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఇప్పటివరకు గుర్తించబడని డూప్లికేట్ ఓట్లు ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వెలుగులోకి వచ్చే అవకాశాలు పెరిగాయి. అందుకే ప్రతి ఓటరు తన ఓటు నమోదు వివరాలను ఒకసారి తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు.

**ఒక వ్యక్తికి ఒకటే ఓటు హక్కు...**
**రెండు చోట్ల నమోదు చట్టవిరుద్ధం**

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించింది. అయితే ఆ హక్కు ఒకే ప్రాంతంలో మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. ఉద్యోగం, చదువు, వ్యాపారం కారణంగా చాలామంది ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారుతుంటారు. కొత్త ప్రాంతంలో ఓటు నమోదు చేసుకున్న తర్వాత పాత ప్రాంతంలోని ఓటును తొలగించకపోతే అదే డూప్లికేట్ ఓటుగా పరిగణించబడుతుంది. అలాంటి పరిస్థితి చట్టపరమైన సమస్యలకు దారితీస్తుంది. ఎన్నికల కమిషన్ ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలనే సూత్రాన్ని కచ్చితంగా అమలు చేయాలని చర్యలు చేపడుతోంది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం నేరంగా పరిగణించబడుతుంది. ఒకేసారి రెండు చోట్ల ఓటు వేయడం మరింత తీవ్రమైన ఉల్లంఘనగా భావిస్తారు. కొందరు తెలియక చేసినా, మరికొందరు నిర్లక్ష్యంతో పాత ఓటును తొలగించకపోయినా చట్టం ముందు రెండూ ఒకేలా పరిగణించే అవకాశం ఉంటుంది. అందుకే కొత్త ప్రాంతంలో నమోదు పూర్తయిన వెంటనే పాత ఓటు తొలగింపునకు దరఖాస్తు చేయడం అవసరమని అధికారులు చెబుతున్నారు. చాలా మంది తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ నివశిస్తున్నప్పటికీ హైదరాబాద్‌లో ఓటు హక్కు కలిగి ఉండటాన్ని నిపుణులు గుర్తు చేస్తున్నారు. చాలా మంది ఇలా రెండు చోట్ల ఓటేస్తున్నారన్న భావన కూడా ఉండటంతో ఇప్పుడు ఫోకస్ అంతా డబుల్ ఓట్లపైనే పడింది.




**ఏఐతో డూప్లికేట్ ఓట్ల గుర్తింపు...**
**ఎస్ఐఆర్‌లో ప్రత్యేక పరిశీలన**

ప్రత్యేక సమగ్ర సర్వే సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలు సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియలో ఒకే వ్యక్తి రెండు ప్రాంతాల్లో పత్రాలు నింపిన విషయం బయటపడితే సంబంధిత వివరాలు పరిశీలనకు వెళ్తాయి. అవసరమైతే వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసే అవకాశం ఉంటుంది. తప్పుడు సమాచారం సమర్పించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు కూడా తప్పవని ఎన్నికల శాఖ హెచ్చరిస్తోంది. ఎన్నికల వ్యవస్థలో ఇప్పుడు కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతికతను వినియోగిస్తున్నారు. పేరు, తల్లిదండ్రుల వివరాలు, పుట్టిన తేదీ, చిరునామా, ఇతర గుర్తింపు సమాచారాన్ని విశ్లేషించి ఒకే వ్యక్తి రెండు చోట్ల నమోదు అయ్యాడా అనే విషయాన్ని గుర్తించే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంది. గతంలో మానవ పరిశీలనతో తప్పిపోయిన నమోదులు కూడా ఇప్పుడు సులభంగా గుర్తించే అవకాశం ఉంది. అందుకే డూప్లికేట్ ఓట్లపై ఎన్నికల కమిషన్ మరింత కఠినంగా వ్యవహరిస్తోంది.

**డీలిమిటేషన్ చర్చకు కొత్త ఊపు..**
**అమిత్ షా వ్యాఖ్యలతో మళ్లీ చర్చ**

లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా "ఒక వ్యక్తి–ఒక ఓటు–ఒకే విలువ" అనే సూత్రాన్ని ప్రస్తావిస్తూ ప్రతి ఓటుకు సమాన విలువ ఉండాలని పేర్కొన్నారు. దేశంలోని కొన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో 48 లక్షల మంది ఓటర్లు ఉండగా, మరికొన్ని చోట్ల కేవలం ఆరు లక్షల మంది మాత్రమే ఉన్నారని ఆయన చెప్పారు. ఈ అసమానత కారణంగా ప్రతి ఓటుకు సమాన విలువ దక్కడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య బలం ప్రతి ఓటు సమాన ప్రాధాన్యం పొందడంలోనే ఉందని ఆయన స్పష్టం చేశారు. లోక్‌సభ స్థానాల పునర్విభజన అవసరాన్ని కూడా అమిత్ షా వివరించారు. జనాభా భారీగా పెరిగినా లోక్‌సభ స్థానాల సంఖ్య చాలా కాలంగా మారలేదని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ప్రజాప్రతినిధులు తక్కువ సంఖ్యలో ఓటర్లకు అందుబాటులో ఉండగలరని ఆయన అభిప్రాయ పడ్డారు. మహిళా రిజర్వేషన్ అమలు కూడా డీలిమిటేషన్‌తో ముడిపడి ఉందని ఆయన వివరిం చారు.

**నోటీసులు, శిక్షలు తప్పవు**

రెండు చోట్ల ఓటు నమోదు కొనసాగితే ముందుగా నోటీసులు జారీ చేసే అవకాశం ఉంటుంది. విచారణలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు నమోదు చేసినట్లు తేలితే జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం కూడా ఉంది. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా ఉంచేందుకు కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటోంది.

అందువల్ల ప్రతి ఓటరు తన ఓటు వివరాలను వెంటనే పరిశీలిం చాలి. పాత ప్రాంతంలో ఓటు ఉంటే దానిని తొలగించి ఒకే చోట చెల్లుబాటు అయ్యే ఓటు నమోదును కొనసాగించడం ద్వారా భవిష్యత్తులో ఇబ్బందులను పూర్తిగా నివారించవచ్చు.

## 'ట్రిపుల్ ఏటీఎం'గా అమరావతి

**కూటమి ప్రభుత్వంపై అంబటి ఆరోపణలు**

గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్సార్సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అమరావతి పేరుతో భారీ ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో పోలవరం ప్రాజెక్టును ఏటీఎంలా ఉపయోగించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇప్పుడు అమరావతిని "ట్రిపుల్ ఏటీఎం"గా మార్చారని వ్యాఖ్యానించారు. రూ.47 వేల కోట్ల అప్పులతో రాజధాని పేరుతో భారీ దోపిడీ జరుగుతోందని ఆరోపించారు.

**తప్పుడు కేసులు నమోదు చేశారన్న ఆరోపణ**

పెనుమాక ప్రాంతంలో భూములు ఇవ్వడానికి నిరాకరిస్తున్న రైతులపై ప్రభుత్వం నిర్బంధ భూసేకరణకు పాల్పడుతోందని అంబటి రాంబాబు విమర్శించారు. రైతుల విజ్ఞప్తి మేరకు పరామర్శకు వెళ్తున్న వైఎస్సార్సీపీ కమిటీపై టీడీపీ శ్రేణులు రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేశారని ఆరోపించారు. పోలీసులు చూస్తుండగానే ఈ ఘటన జరిగిందని అన్నారు. అమరావతికి వెళ్లాలంటే వీసా అవసరమా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దాడికి గురైన వారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి విమర్శించారు. కానిస్టేబుల్‌పై రాయి విసిరిన వ్యక్తిని వదిలేసి, బాధితులైన తమపై కేసులు పెట్టారని ఆరోపించారు. రాజకీయ కక్షతోనే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు.

**ప్రతిపక్ష పోరాటం కొనసాగుతుందన్న స్పష్టం**

ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఒత్తిళ్లు తీసుకొచ్చినా వైఎస్సార్సీపీ వెనక్కి తగ్గదని అంబటి రాంబాబు స్పష్టం చేశారు. అమరావతి రైతులకు అన్యాయం జరిగితే తమ పార్టీ అండగా నిలుస్తుందని చెప్పారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లి చట్టబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన సాయికృష్ణ లాకప్ మరణం కేసులో సిట్ దర్యాప్తు పలు అనుమానాలకు తావిస్తోందని అంబటి రాంబాబు అన్నారు. కేవలం ఒక అధికారిని మాత్రమే బాధ్యుడిగా చూపించి అసలు విషయాలను పక్కనపెడుతున్నారని ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌తో పాటు నగరంలోని సీసీటీవీ దృశ్యాలు ఎలా మాయమయ్యాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## ప్రేమ, పెళ్లి, హత్య కుట్ర

**మూడేళ్ల స్వేచ్ఛ కోసమేనా?**

**కేసు దర్యాప్తులో కొత్త కోణం**

పుణె వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసులో దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. దర్యాప్తు వర్గాల సమాచారం ప్రకారం నిందితురాలు సియా గోయల్ తనకు "మూడేళ్ల స్వేచ్ఛ" లభించాలనే ఉద్దేశంతో ఈ కుట్రలో భాగమై ఉండవచ్చనే అనుమానాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న చేతన్ చౌదరి తన కెరీర్‌లో స్థిరపడేందుకు కనీసం మూడు సంవత్సరాలు వేచి ఉండాలని సియాకు చెప్పినట్లు సమాచారం. అయితే అప్పటికే సియాకు కేతన్‌తో నవంబర్‌లో వివాహం నిశ్చయమై ఉండటంతో ఈ కుట్ర పుట్టుకొచ్చిందనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

**ముందుగానే పన్నిన కుట్ర?**

దర్యాప్తు ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే కేతన్ హత్యకు సంబంధించిన ప్రణాళిక ప్రారంభమైనట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వివాహం జరిగితే తమ భవిష్యత్‌కు ఆటంకం కలుగుతుందని భావించి కేతన్‌ను తొలగించాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారనే అనుమానాలపై పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. కుటుంబంలో విషాదం నెలకొంటే కొంతకాలం పెళ్లి చర్చలు ఆగిపోతాయని, ఆ సమయం తర్వాత ఇద్దరూ వివాహం చేసుకోవాలనే ఆలోచనతో కుట్ర పన్నినట్లు దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

**ఇంటర్నెట్‌లో సమాచారం**

కేతన్‌ను ఎలా హత్య చేయాలనే అంశంపై సియా, చేతన్ ఇంటర్నెట్‌లో సమాచారం వెతికారని పోలీసులు చెబుతున్నారు. నేరానికి ముందు ఇద్దరూ లోహగడ్ కోటకు వెళ్లి అక్కడ పరిస్థితులను పరిశీలించినట్లు దర్యాప్తులో తేలింది. ఘటన జరిగిన తర్వాత పోలీసులు ప్రశ్నిస్తే ఎలా సమాధానం చెప్పాలనే అంశంపై కూడా ముందుగానే సమాధానాలను సిద్ధం చేసుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఆరోపణలను బలపరిచే డిజిటల్ ఆధారాలను ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తున్నారు.

**మొదటి ప్రయత్నం విఫలం?**

దర్యాప్తు సమాచారం ప్రకారం జూన్ 14న సియా కేతన్‌ను లోహగడ్ కోటకు తీసుకెళ్లి తొలిసారి తోసివేయడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే కేతన్ ఒక పొదను పట్టుకుని బయటపడినట్లు అధికారులు చెబుతున్నారు. అనంతరం పాము కనిపించిందని కేకలు వేస్తూ పరిస్థితిని మార్చే ప్రయత్నం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆ తర్వాత మరోసారి కోటకు రావాలని కేతన్‌ను ఒప్పించి, అక్కడ చేతన్ సహాయంతో లోయలోకి తోసివేసినట్లు ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు.

**ఫోన్లలో తొలగించిన చాట్లు**

సియా, చేతన్ తమ మొబైల్ ఫోన్లలోని చాట్ హిస్టరీతో పాటు రీసైకిల్ బిన్‌లోని సమాచారాన్ని కూడా తొలగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఫోన్లను ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపి తొలగించిన సమాచారాన్ని తిరిగి పొందే ప్రయత్నాలు జరుగుతున్నాయి. డిజిటల్ ఆధారాలు ఈ కేసులో కీలకంగా మారే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. నిందితులు మారు వేషాలు ధరించి అనుమానాలకు తావు లేకుండా ఉండాలని కూడా ప్రణాళిక రూపొందించినట్లు దర్యాప్తులో బయట పడింది. హత్య ప్రణాళిక విఫలమైతే అమలు చేసేందుకు మరో ప్రత్యామ్నాయ ప్రణాళికను కూడా సిద్ధం చేసినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. ఈ అంశంపై కూడా పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన వివరాలు దర్యాప్తు ఆధారంగా ఉన్న ఆరోపణలు మాత్రమే. నిందితులపై నమోదైన అభియోగాల నిజానిజాలను కోర్టు విచారణ అనంతరమే నిర్ధారించాల్సి ఉంటుంది.




## రెండేళ్ల నమ్మకమే నినాదం

**అభివృద్ధి, సంక్షేమమే అజెండా**

**పశ్చిమలో ఘనంగా విజయోత్సవ సభ**

ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" పేరుతో విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఉర్మిళ నగర్‌లోని హెచ్‌ఓ కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, బుద్దా వెంకన్నతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై నాయకులు ప్రజలకు వివరించారు.

**పశ్చిమ అభివృద్ధికి కృషి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేశామని ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థ బలపడిందని పేర్కొన్నారు. చివరి లబ్ధిదారుడికి కూడా ప్రభుత్వ ప్రయోజనాలు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

**వైద్యం, ఉపాధికి ప్రాధాన్యం**

సుజనా ఫౌండేషన్ ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రెండు అత్యాధునిక మొబైల్ మెడికల్ వ్యాన్ల ద్వారా ప్రజలకు వైద్య సేవలు చేరుతున్నాయని చెప్పారు. నిరుద్యోగ యువతకు జాబ్ మేళాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. ఎంఎస్ఎంఈ పథకాలను సద్వినియోగం చేసుకొని యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఇప్పటివరకు చేసిన అభివృద్ధి ప్రారంభం మాత్రమేనని, ముందున్న రోజుల్లో మరింత వేగంగా పనులు కొనసాగిస్తామని చెప్పారు.

**సూపర్ సిక్స్ అమలుపై విశ్వాసం**

ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ మాట్లాడుతూ, గత పాలనలో ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాజధాని అమరావతి పునర్నిర్మాణంతో పాటు సంక్షేమ కార్యక్రమాలు సమర్థంగా అమలవుతున్నాయని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, దీపం–2 వంటి పథకాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని వివరించారు. కూటమి నాయకులు ఐక్యంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరచాలని పిలుపునిచ్చారు.

**ఐక్యతతో ముందుకు సాగుదాం**

జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను మాట్లాడుతూ, పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలతో ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందారని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా కూటమి నాయకులు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## జనసైనికులకు గుర్తింపు ఎప్పుడు?

**పదవులపై పెరుగుతున్న అసంతృప్తి**

**పార్టీ కోసం శ్రమించిన వారిలో ఆవేదన**

కాకినాడ జిల్లా గొల్లప్రోలు, పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు దక్కడం లేదనే అసంతృప్తి పెరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విజయం కోసం అహర్నిశలు శ్రమించిన జనసైనికులకు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి, పైరవీల ద్వారా అవకాశాలు పొందిన వారికి పార్టీ పదవులు లభిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో శ్రమించిన వారిని పక్కనపెట్టి కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కార్యకర్తల్లో నిరాశ నెలకొన్నట్లు తెలుస్తోంది.




**పదవుల పంపిణీపై విమర్శలు**

పిఠాపురంలో పవన్ కళ్యాణ్‌తో పాటు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ విజయానికి కృషి చేసిన పలువు రు కీలక కార్యకర్తలు ఇప్పుడు తెరమరుగ వుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. పార్టీ కోసం రేయింబవళ్లు శ్రమించిన వారికి పదవులు ఇవ్వకుండా, ప్రాధాన్యత లేని వ్యక్తులను కీలక స్థానాల్లో నియమించడం సరైన విధానం కాదని స్థానిక నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఒకే వ్యక్తి వద్ద మూడు, నాలుగు పదవులు ఉండటం కూడా పార్టీలో చర్చకు కారణమవుతోంది. సీనియర్ నాయకులకు సైతం తగిన బాధ్యతలు దక్కకపోవడం అసంతృప్తిని మరింత పెంచుతోంది.

**క్షేత్రస్థాయిలో తగ్గుతున్న ఉత్సాహం**

పదవులు పొందిన కొంతమంది నాయకులు క్షేత్రస్థాయి కార్యకర్తలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జనసేన ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారు, గతంలో ఎన్నో ఒత్తిళ్లు ఎదుర్కొన్న వారు కూడా గుర్తింపు లేక నిరాశ వ్యక్తం చేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలపై ప్రభావం పడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా పిఠాపురం నియోజకవర్గానికి పూర్తి స్థాయి పార్టీ ఇంచార్జి లేకపోవడం కూడా సమస్యగా మారిందని కార్యకర్తలు చెబుతున్నారు. స్థానిక సమస్యలు ఎదురైనప్పుడు ఎవరిని సంప్రదించాలో స్పష్టత లేక చాలామంది ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం.

**పవన్ కళ్యాణ్ జోక్యం కోరుతున్న కార్యకర్తలు**

ఎన్నికల తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు ఎక్కువ ప్రాధాన్యత లభించడం, గతంలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి కూడా అవకాశాలు కల్పించడం వల్ల నిజమైన జనసైనికులు పక్కకు నెట్టబడ్డారనే భావన పెరుగుతోంది.

పోసాని మురళి,
బద్వేల్ నుంచి
+91 77803 20992

# మాయా మహల్..
# కాగితాలపై పుట్టిన ఇల్లు!

## సర్వే నంబర్ మార్పు వెనుక దాగిన నిజాలు
## పాత ఊరు కొత్త రికార్డుల మర్మమేంటి?
## పరిశీలన లేకుండానే లక్షల బ్యాంకు రుణం






ఒక ఇల్లు కట్టాలంటే పునాది కావాలి. గోడలు కావాలి. పైకప్పు కావాలి. కానీ ఇప్పుడు అవేమీ అవసరం లేదేమో! కాగితాలపై ఇల్లు పుడితే చాలు... రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది... లక్షల రూపాయల రుణం కూడా చేతికొస్తుంది. ఇది సినిమా కథ కాదు.

వ్యవస్థలోని బలహీనతలను, అధికార యంత్రాంగంలో దాగి ఉన్న ప్రమాదకర లోపాలను ప్రశ్నించే వాస్తవ కథ. ఒక ఊరు కాలగర్భంలో కలిసిపోయింది. ఇంటి జాడ లేదు. అయినా ప్రభుత్వ రికార్డుల్లో విలాసవంతమైన గృహం ప్రత్యక్షమైంది. సర్వే నంబర్ మారింది. భూమి స్వరూపం మారింది. రిజిస్ట్రేషన్ జరిగింది. తర్వాత బ్యాంకు రుణం కూడా మంజూరైంది.

ఇన్ని దశలు దాటినా ఒక్క అధికారిక వ్యవస్థకూ అనుమానం రాకపోవడం ఆశ్చర్యమా... లేక ఇదంతా తెలిసే జరిగిందా.. ?

? ప్రజలు చెల్లించే పన్నులతో నడిచే వ్యవస్థ నిజాలను కాపాడాల్సింది పోయి, కాగితాల మాయాజాలానికి వేదికగా మారితే బాధ్యత ఎవరిది?

చట్టాలను గౌరవించే సాధారణ పౌరుడే తప్పు చేసినవాడా? లేక చట్టాలనే తమకు అనుకూలంగా మలుచుకునే వారే అసలు విజేతలా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. ఒకప్పుడు జనసంచారంతో కళకళలాడిన గ్రామం. కాలక్రమంలో ప్రజలు వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. పాత ఊరు పూర్తిగా ఖాళీ అయింది. ఇప్పుడు అక్కడ కనిపించేది మట్టి, పొదలు, ఖాళీ స్థలం మాత్రమే. కానీ ప్రభుత్వ రికార్డులు మాత్రం మరో కథ చెబుతున్నాయి. ఆ ప్రాంతంలో విలువైన డాబా ఇల్లు ఉందని నమోదు చేశారు. కాగితాలపై ఇల్లు ఉంది. నేలపై మాత్రం ఇంటి ఆనవాళ్లు కూడా కనిపించవు. ఈ విరుద్ధ పరిస్థితిని వెలుగులోకి తెచ్చింది నాదేశం పత్రిక చేపట్టిన పరిశోధన. ఇది ఊహాజనిత కథ కాదు. స్థానిక సమాచారం, రికార్డులు, పత్రాల ఆధారంగా బయటపడిన అంశాలు ఇప్పుడు బద్వేలు ప్రాంతంలో చర్చనీయాంశంగా మారాయి.

### సర్వే నంబరులో కొత్త మలుపు... కనిపించని ఇంటి కథ

ఈ కథలో ప్రధాన ప్రశ్న ఒక్కటే. నిజంగా అక్కడ ఇల్లు ఉందా? ఎవరైనా ఆ ప్రాంతానికి వెళితే కనిపించేది ఖాళీ భూమి మాత్రమే. గోడలు లేవు. పైకప్పు లేదు. పునాది కూడా కనిపించదు. అయినా అదే స్థలాన్ని నివాస గృహంగా రికార్డుల్లో నమోదు చేశారు. సాధారణంగా రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తి స్వరూపం పరిశీలించాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో ఇంటి ఆనవాళ్లు కూడా లేని చోట డాబా ఇల్లు ఎలా నమోదైంది అన్న సందేహం ప్రజల్లో బలపడుతోంది. ఈ వ్యవహారం కేవలం ఒక కుటుంబానికి సంబంధించిన అంశంగా కాకుండా ప్రభుత్వ రికార్డుల విశ్వసనీయతను ప్రశ్నించే స్థాయికి చేరింది. ఈ వ్యవహారంలో మరో కీలక అంశం సర్వే నంబర్. స్థానికంగా లభించిన వివరాల ప్రకారం ఇంటికి చూపించిన సర్వే నంబర్ అసలు ఆ స్థలానిది కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. దాదాపు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న మరో భూమికి చెందిన సర్వే నంబర్‌ను ఈ ఇంటికి అనుసంధానం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల్లో కూడా అలాంటి అంశాలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అంతేకాదు, ఆ సర్వే నంబర్ సాధారణ పట్టా భూమికి సంబంధించినది కాకుండా డీకేటీ భూమిగా నమోదైందనే ఆధారాలు కూడా ఉన్నాయని సమాచారం. డీకేటీ భూముల విషయంలో ప్రత్యేక నిబంధనలు అమల్లో ఉంటాయి. అలాంటి భూమికి సంబంధించిన వివరాలు ఈ రిజిస్ట్రేషన్‌లో ఎలా చేరాయన్నది పెద్ద ప్రశ్నగా మారింది.

### ఓపాత ఊరు... కొత్త రికార్డులు...
### రిజిస్ట్రేషన్ ఎందుకు దూరంలో?

స్థానికుల కథనం ప్రకారం బయనపల్లె గ్రామంలోని పాత ఊరు సర్వే నంబర్ 27ఏ పరిధిలో ఉండేది. అయితే రిజిస్ట్రేషన్ సమయంలో అదే ప్రాంతాన్ని సర్వే నంబర్ 113గా చూపించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తగా రూపొందించిన రికార్డుల్లో కూడా అదే వివరాలు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. ఒక గ్రామ చరిత్రను మార్చే స్థాయిలో రికార్డులు మారితే భవిష్యత్తులో భూ హక్కులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భూమి యాజమాన్యం విషయంలో సర్వే నంబర్ అత్యంత కీలకమైన అంశం. అదే మారిపోతే అసలు హక్కుదారుల పరిస్థితి ఏమవుతుందనే సందేహం తలెత్తుతోంది. ఈ వ్యవహారంలో మరో ఆసక్తికర అంశం రిజిస్ట్రేషన్ జరిగిన ప్రదేశం. ఆస్తి బద్వేలు పరిధిలో ఉందని చెబుతుండగా రిజిస్ట్రేషన్ మాత్రం దాదాపు యాభై కిలోమీటర్ల దూరంలోని సిద్ధవటం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగింది. ప్రస్తుతం ఎక్కడి నుంచైనా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నా సాధారణంగా ఆస్తి ఉన్న ప్రాంతానికే సంబంధించిన కార్యాలయాన్ని ఆశ్రయించడం సర్వసాధారణం. అలాంటి పరిస్థితిలో బయనపల్లె మాజీ సర్పంచ్ ఆరేళ్ల పద్మావతి, ఆమె భర్త వేణుగోపాల్ సిద్ధవటం కార్యాలయాన్ని ఎందుకు ఎంచుకున్నారన్న ప్రశ్న ఇప్పుడు చర్చకు దారితీసింది. బద్వేలు కార్యాలయం అందుబాటులో ఉండగా దూర ప్రాంతాన్ని ఎందుకు ఆశ్రయించారన్న సందేహం మరింత బలపడుతోంది.

### పరిశీలన జరిగిందా?
### రూ.23.40 లక్షల రుణం ఎలా?

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆస్తికి సంబంధించిన పత్రాలు, సర్వే వివరాలు, యాజమాన్య హక్కులు పరిశీలించడం కీలక దశ. అవసరమైతే స్థానిక ధృవీకరణ కూడా చేపట్టాలి. అయితే ఈ కేసులో ఆ ప్రక్రియలు పూర్తిగా జరిగాయా అనే ప్రశ్నకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం లేదు. ఆస్తి ఒకచోట ఉండగా రిజిస్ట్రేషన్ మరోచోట జరగడం, సర్వే నంబర్‌పై వివాదం ఉండటం, ఇంటి ఉనికి ప్రశ్నార్థకంగా మారడం వంటి అంశాలు విచారణ అవసరాన్ని మరింత పెంచుతున్నాయి. ఈ వ్యవహారంలో అత్యంత కీలక మలుపు బ్యాంకు రుణం. రిజిస్ట్రేషన్ పూర్తైన కొద్ది రోజులకే అదే ఆస్తిని తనఖా పెట్టి బద్వేలులోని ఒక ప్రైవేట్ బ్యాంకులో రుణం తీసుకున్నట్లు సమాచారం. ఈ ఏడాది జనవరిలో రిజిస్ట్రేషన్ జరగగా మార్చిలో ఆరేళ్ల పద్మావతి పేరుతో రూ.23 లక్షల 40 వేల రుణం మంజూరైనట్లు సమాచారం. ఆ మొత్తం ఆమె ఖాతాలో జమ అయినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏ బ్యాంకు అయినా రుణం మంజూరు చేసే ముందు ఆస్తిని భౌతికంగా పరిశీలిస్తుంది. మార్కెట్ విలువ అంచనా వేస్తుంది. న్యాయపరమైన అభిప్రాయం తీసుకుంటుంది. సర్వే వివరాలను సరిపోలుస్తుంది. అలాంటి ప్రక్రియలన్నీ ఈ కేసులో ఎలా జరిగాయన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా నిలిచింది.

### విచారణే అసలు పరిష్కారం..
### గ్రామాల్లో జోకులే జోకులు

ఈ వ్యవహారం బయటకు వచ్చిన తర్వాత గ్రామాల్లో వ్యంగ్య వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. "ఇక ఇల్లు కట్టాల్సిన అవసరం లేదు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుందాం. తర్వాత ఇల్లు వెతుక్కుందాం" అంటూ పలువురు మాట్లాడుతున్నారు. ఈ వ్యాఖ్యలు కేవలం హాస్యం కాదు. ప్రభుత్వ రికార్డులపై ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలకు ప్రతిబింబంగా మారాయి. అధికార వ్యవస్థపై నమ్మకం తగ్గితే ప్రజల విశ్వాసాన్ని తిరిగి సంపాదించడం చాలా కష్టం. ప్రజాప్రతినిధుల పేర్లు ఏ వివాదంలో వినిపించినా నిష్పాక్షిక విచారణ జరగాలనే అభిప్రాయం సహజం. అదే సమయంలో ఆరోపణలు వచ్చినంత మాత్రాన వాటిని నిజాలుగా ప్రకటించడం కూడా సముచితం కాదు. అందుకే ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, సంబంధిత ఆర్థిక సంస్థలు సమగ్ర విచారణ చేపట్టాలి. రికార్డులు ఎలా రూపొందాయి? సర్వే నంబర్ ఎందుకు మారింది? ఇంటి ఉనికి నిజమేనా? డీకేటీ భూమి అంశం ఏమిటి? రుణం మంజూరు సమయంలో ఏ ప్రమాణాలు పాటించారు? వంటి ప్రతి అంశాన్ని ప్రజల ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉంది.



### ఈ ప్రశ్నకు సమాధానం ఎవరు చెబుతారు?

ఒక వ్యక్తి నకిలీ పత్రం సృష్టిస్తే అది నేరం. అదే నకిలీ పత్రం ప్రభుత్వ రికార్డుగా మారితే అది వ్యవస్థ వైఫల్యం. ఆ రికార్డుపై రిజిస్ట్రేషన్ జరిగితే అది పరిపాలనా లోపం. అదే పత్రాల ఆధారంగా లక్షల రూపాయల రుణం మంజూరైతే అది కేవలం పొరపాటు కాదు... ప్రజల విశ్వాసంపై జరిగిన దాడి. ఈ వ్యవహారంలో అసలు నిందితుడు ఎవరు? పత్రాలు సిద్ధం చేసిన వ్యక్తులా? కళ్లు మూసుకున్న అధికారులా? పరిశీలించకుండా ఆమోదం తెలిపిన వ్యవస్థా? లేక ప్రశ్నించని సమాజమా? చట్టం సామాన్యుడికి మాత్రమే వర్తిస్తే అది న్యాయం కాదు. అధికారం ఉన్నవారికి కూడా సమానంగా వర్తించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ఈ కేసులో నిజాలు ఏవైనా కావచ్చు. ఆరోపణలు నిరూపితమైతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పనిసరి. ఆరోపణలు తప్పని తేలితే అధికారికంగా ప్రజలకు వివరించాలి. నిజం వెలుగులోకి రాకపోతే రేపు కాగితాలపై గ్రామాలు పుడతాయి... పొలాలు మాయమవుతాయి... చివరకు ప్రజల హక్కులే కనిపించకుండా పోతాయి. అప్పటికి ప్రశ్నించే అవకాశం కూడా మిగలకూడదంటే ఇప్పుడే వ్యవస్థ మేల్కొనాలి.



బద్వేలు భూకబ్జా కొనసాగింపు...
రేపటి సంచికలో..

### ప్రేక్షకపాత్రలు ఎవరు... సూత్రధారులు ఎవరు?

ఈ వ్యవహారంలో అసలు ప్రశ్న ఒక్కటే. ఇల్లు లేని చోట ఇల్లు ఎలా పుట్టింది? సర్వే నంబర్ ఎలా మారింది? రిజిస్ట్రేషన్ ఎలా పూర్తైంది? లక్షల రూపాయల రుణం ఎలా మంజూరైంది? ఈ ప్రశ్నలకు సమాధానం వెతికితే వ్యవస్థలోని ప్రతి మెట్టు కనిపిస్తోంది. పత్రాలు సమర్పించినవారు ఒకరు కావచ్చు. వాటిని పరిశీలించాల్సినవారు ఇంకొందరు. ఆమోదించినవారు వేరొకరు. రుణం విడుదల చేసినవారు మరోవైపు. మరి ఇంత పెద్ద ప్రక్రియలో అందరూ కేవలం ప్రేక్షకపాత్రలేనా? లేక ఎవరో సూత్రధారులా? ఒక్క తప్పు జరిగితే దాన్ని సరిదిద్దే వ్యవస్థ ఉంది. కానీ వరుసగా ప్రతి దశ దాటుతూ చివరకు లక్షల రూపాయలు విడుదలయ్యాయంటే అది సాధారణ నిర్లక్ష్యమా? లేక బాధ్యతారాహిత్యమా? ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపైనే ఉంది. నిజంగా వ్యవస్థ పనిచేసిందా? లేక వ్యవస్థనే ఎవరో తమ అవసరాలకు పనిచేయించుకున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానం వచ్చే వరకు ఈ కథకు ముగింపు లేదు.

# కాంగ్రెస్‌లో భారీ మార్పులు

### సంస్థాగత ప్రక్షాళనకు శ్రీకారం
### రాష్ట్రాల అధ్యక్షుల మార్పులు



కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టింది. పార్టీని ఎన్నికలకు మరింత సమర్థంగా సిద్ధం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర స్థాయి నాయకత్వంలో కీలక మార్పులు చేపడుతోంది. ఈ క్రమంలో తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి కొత్త అధ్యక్షుడిని నియమించింది. రాబోయే రోజుల్లో మరిన్ని రాష్ట్రాల్లో కూడా ఇలాంటి మార్పులు జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### తమిళనాడుకు కొత్త పీసీసీ అధ్యక్షుడు

విరుధునగర్ లోక్‌సభ సభ్యుడు బి. మాణికం ఠాగూర్‌ను తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పార్టీ అధిష్ఠానం నియమించింది. రాహుల్ గాంధీకి సన్నిహితుడిగా గుర్తింపు పొందిన ఆయనకు పార్టీ సంస్థాగత బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నియామకం కాంగ్రెస్ చేపడుతున్న విస్తృత పునర్వ్యవస్థీకరణలో తొలి కీలక నిర్ణయంగా భావిస్తున్నారు.

### కేరళలోనూ నాయకత్వ మార్పు

కేరళలో కూడా త్వరలో కొత్త పీసీసీ అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సన్నీ జోసెఫ్ రాష్ట్ర మంత్రివర్గంలో చేరడంతో ఆ పదవి ఖాళీ కానుంది. ఈ స్థానానికి ఎనిమిది సార్లు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైన కొడికున్నిల్ సురేష్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. షెడ్యూల్డ్ కులాల ప్రముఖ నాయకుడైన ఆయనకు పార్టీ అధిష్ఠానం ప్రాధాన్యం ఇవ్వవచ్చనే చర్చ సాగుతోంది.

### పంజాబ్‌పై ప్రత్యేక దృష్టి

వచ్చే ఏడాది ప్రారంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పంజాబ్‌పై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్ర నాయకత్వంపై నెలకొన్న విభేదాలను పరిష్కరించేందుకు ముగ్గురు పరిశీలకులను పార్టీ నియమించింది. వర్గపోరు పార్టీకి నష్టం కలిగించకుండా ముందుగానే చర్యలు తీసుకుంటోంది. ఎన్నికలకు ముందు బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### ఇతర రాష్ట్రాల్లోనూ మార్పుల సంకేతాలు

బీహార్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కూడా నాయకత్వ మార్పులపై చర్చ జరుగుతోంది. అధికారిక ప్రకటన వెలువడకపోయినా పార్టీ అంతర్గతంగా సమీక్ష కొనసాగుతున్నట్లు సమాచారం. ఉత్తరప్రదేశ్‌కు ఏఐసీసీ ఇన్‌ఛార్జిగా ఉన్న అవినాశ్ పాండే తన పదవీకాలం ముగిసిందని ప్రకటించారు. మహారాష్ట్ర ఇన్‌ఛార్జిగా ఉన్న రమేష్ చెన్నితల కేరళ హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆ స్థానంలో కూడా కొత్త నియామకం జరగనుంది. అసోం ఎన్నికల పరాజయం తర్వాత జితేందర్ సింగ్ ఇప్పటికే ఇన్‌ఛార్జి పదవికి రాజీనామా చేశారు.

### సేవాదళానికి కొత్త సారథి

కాంగ్రెస్ అనుబంధ విభాగాల్లో కూడా మార్పులు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన నిర్వాహకుడిగా మాజీ ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ బి.వి.ను పార్టీ నియమించింది. రాష్ట్ర అధ్యక్షుల మార్పు, ఇన్‌ఛార్జుల నియామకాలు, అనుబంధ విభాగాల పునర్వ్యవస్థీకరణ ద్వారా పార్టీని మరింత చురుకుగా మార్చాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు, భవిష్యత్ రాజకీయ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఈ సంస్థాగత మార్పులు చేపడుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు

### పోస్టర్ ఆవిష్కరించిన వైఎస్ షర్మిల

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ నివాసంలో ఆవిష్కరించారు. రాష్ట్ర అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల కాంగ్రెస్ చైర్మన్, దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ పోస్టర్ రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ సైదా, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ, జూలై 8న జరగనున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇడుపులపాయలోని వైఎస్ ఘాట్ వద్ద నిర్వహించే జయంతి కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వైఎస్సార్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

# గుడ్లపై కొత్త వివాదం



### మధ్యాహ్న భోజనంలో గుడ్లకు గుడ్‌బై
### బెంగాల్ నిర్ణయంపై చర్చ.. రచ్చ
### తమిళనాడు, ఒడిశా మోడళ్లపై దృష్టి

పశ్చిమ బెంగాల్‌లో పాఠశాల మధ్యాహ్న భోజన పథకంలో కీలక మార్పు చోటుచేసుకుంది. కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సుమారు 1,800 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో వండిన భోజనం సరఫరా బాధ్యతను ఇస్కాన్‌కు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానంలో గుడ్లకు బదులుగా ఖిచ్డీ, పనీర్, రాజ్మా, సోయాబీన్స్, పప్పు పదార్థాలు అందించనున్నారు. ఇస్కాన్ పాటించే సాత్విక ఆహార విధానంలో గుడ్లు, ఉల్లిపాయలు, వెల్లుల్లికి స్థానం లేకపోవడంతో ఈ మార్పు అమల్లోకి వస్తోంది.

### పోషకాహారంపై ఆందోళనలు

మధ్యాహ్న భోజన పథకం కేవలం ఆకలి తీర్చే కార్యక్రమం మాత్రమే కాదు. పిల్లలకు అవసరమైన పోషకాహారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. గుడ్లు గ్రామీణ, పేద కుటుంబాల పిల్లలకు ప్రోటీన్ ప్రధాన వనరుగా భావిస్తారు. ఈ నేపథ్యంలో గుడ్లను తొలగించడం వల్ల పిల్లల పోషకాహారంపై ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా దళిత, ఆదివాసీ, ముస్లిం, శ్రామిక కుటుంబాలకు చెందిన పిల్లల ఆహారపు అలవాట్లపై కూడా ఈ నిర్ణయం ప్రభావం చూపుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### తమిళనాడు చూపిన ప్రత్యామ్నాయం

పాఠశాల భోజన పథకంలో తమిళనాడు దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. 1989లో గుడ్లను మధ్యాహ్న భోజనంలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం, గుడ్లు తినని పిల్లలకు ప్రత్యామ్నాయంగా అరటిపండ్లు అందించే విధానాన్ని అమలు చేసింది. గుడ్లను పూర్తిగా తొలగించకుండా, శాకాహార పిల్లలకు వేరే ఎంపిక కల్పించడం ద్వారా పోషకాహారం, వ్యక్తిగత అభిరుచులకు సమాన ప్రాధాన్యం ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో 51 లక్షలకుపైగా విద్యార్థులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ పథకం కొనసాగుతోంది.

### ఒడిశా అనుసరించిన విధానం

ఒడిశాలో కూడా వండిన భోజనం సరఫరాలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములైనప్పటికీ గుడ్ల పంపిణీని ప్రభుత్వం ప్రత్యేకంగా కొనసాగిస్తోంది. గుడ్లను తొలగించకుండా వేరే వ్యవస్థ ద్వారా పిల్లలకు అందించే ఏర్పాట్లు చేసింది. దీంతో పోషకాహారం విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వ బాధ్యతను కొనసాగించింది. ఈ విధానం బెంగాల్ తీసుకున్న నిర్ణయానికి భిన్నంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

### దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన నిర్ణయం

పాఠశాల భోజన పథకంలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం గతంలో కర్ణాటక, తెలంగాణ, చెన్నై వంటి ప్రాంతాల్లో కూడా చర్చకు దారితీసింది. కేంద్రంగా నిర్ణయించిన ఆహార పట్టిక స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఉంటుందా అనే ప్రశ్నలు అప్పుడే తలెత్తాయి. ఇప్పుడు బెంగాల్ నిర్ణయం కూడా అదే చర్చను మరోసారి ముందుకు తీసుకొచ్చింది. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ నియంత్రణ ఎంతవరకు ఉండాలనే అంశం కూడా ప్రధానంగా మారింది.

### పోషకాహారం, ప్రజా బాధ్యతపై చర్చ

మధ్యాహ్న భోజన పథకం పిల్లల ఆరోగ్యం, విద్యా హాజరు, పాఠశాలల్లో కొనసాగింపుకు కీలక ఆధారంగా నిలుస్తోంది. అందుకే ఈ పథకంలో తీసుకునే ప్రతి నిర్ణయం పిల్లల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. తమిళనాడు, ఒడిశా అనుసరించిన విధానాలు పోషకాహారాన్ని కొనసాగిస్తూ ప్రత్యామ్నాయాలను కల్పించే మార్గాన్ని చూపిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. ఇక బెంగాల్ మాత్రం గుడ్లను పూర్తిగా తొలగించే నిర్ణయంతో కొత్త చర్చకు తెరలేపింది.



భగీరథ ప్రయత్నం ఏపీ ప్రజల నిరీక్షణ....

అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించి సమీక్షలు నిర్వహించారు. కేంద్ర జలశక్తి శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సాంకేతిక సమస్యల పరిష్కారానికి విదేశీ నిపుణుల బృందాన్ని రప్పించారు. ఈ అంతర్జాతీయ నిపుణుల బృందం ఇప్పటికే నాలుగు సార్లు ప్రాజెక్టును సందర్శించి, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ మరమ్మతులపై స్పష్టమైన నివేదికలను అందించింది. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు దశాబ్దాలుగా నలిగిపోతున్న నిర్వాసితుల పునరావాస ప్యాకేజీపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. గతంలో నిలిచిపోయిన నిధుల విడుదలకు మార్గం సుగమం చేసింది. ఇప్పటికే 85 శాతానికి పైగా పనులు పూర్తయిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి సంకల్పం ప్రకారం 2027 కల్లా ఈ ప్రాజెక్టు సాకారం అవుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ భగీరథ ప్రయత్నం విజయవంతమై, పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి నిజమైన వరంగా మారాలని ఆశిద్దాం.

# ఆంధ్రుల కలల ప్రాజెక్టు

# పోలవరం సుదీర్ఘ ప్రయాణం

### నిర్వాసితుల ఇబ్బందులు సామాజిక సమస్యలు..

పోలవరం ప్రాజెక్టు కోసం తమ భూములను, గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితులను అప్పటి ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. తాము అధికారం లోకి వస్తే 2014 భూసేకరణ చట్టం ప్రకారం పూర్తి పరిహారం అందిస్తామని, పట్టిసీమ తరహాలోనే ఎకరాకు రూ.19 లక్షలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారు. 2006లో సేకరించిన భూములకు కూడా రూ.5 లక్షల అదనపు సాయం అందిస్తామని ప్రకటించారు. కానీ ఆచరణలో ఈ వాగ్దానాలు నెరవేరలేదు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తేనే పరిహారం చెల్లిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పుకుంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన పునరావాస కాలనీలలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస మౌలిక వసతులను కల్పించలేదు. దీనివల్ల వరదలు వచ్చినప్పుడు నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరైన ఉపాధి, పరిహారం లభించక వేలాది గిరిజన కుటుంబాలు అడవుల పాలయ్యాయి.

### పెరుగుతున్న అంచనాలు రాజకీయాలు

ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన సమయంలో, 2013-14 ధరల ప్రకారం దీని అంచనా వ్యయం 20,398.61 కోట్ల రూపాయలుగా ఉంది. ఆ తర్వాత 2017-18 నాటికి ఈ వ్యయం 55,548.87 కోట్లకు చేరుకుంది. అయితే, కేంద్ర ప్రభుత్వం 2016లో ఒక ప్రకటన చేస్తూ, తాము మొదటి అంచనా వ్యయమైన 20,398.61 కోట్లకు మాత్రమే బాధ్యత వహిస్తామని స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు పునరావాస కార్యక్రమాల కోసం అప్పట్లోనే 33,198.23 కోట్ల రూపాయలు అవసరమవుతాయని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్రాజెక్టును 2024 జూలై నాటికి పూర్తి చేయాల్సి ఉంది. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరిగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రాజెక్టు పనులు దాదాపు 72 శాతం వరకు పూర్తయ్యాయి. రికార్డు సమయంలో హెడ్‌వర్క్స్, కాలువల తవ్వకం పనులు జరిగాయి. నదీ ప్రవాహాన్ని మళ్లించేందుకు అవసరమైన కాఫర్ డ్యామ్ పనులు, డయాఫ్రమ్ వాల్ నిర్మాణాలు ఈ కాలంలోనే వేగవంతం అయ్యాయి.

## ఒడిదుడుకులు దాటి ముందుకు పోలవరం

### నిర్వాసితుల కష్టాలు... అందని పూర్తి పరిహారం.. సర్వస్వం త్యాగం చేసి గిరిజనుల నిరీక్షణ

తెలుగు రాష్ట్రాలలో వ్యవసాయ రంగం ఎక్కువగా నదుల నుంచి వచ్చే నీటిపైనే ఆధారపడుతుంది. ముఖ్యంగా కృష్ణా, గోదావరి నదుల నీరు ఇక్కడి రైతులకు ప్రధాన జీవన వనరుగా నిలుస్తోంది. కృష్ణా నదిపై ఇప్పటికే శ్రీశైలం డ్యామ్, నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజ్ వంటి పెద్ద ప్రాజెక్టులు నిర్మించారు. కానీ గోదావరి నదిపై ఆ స్థాయిలో పెద్ద డ్యామ్‌లు నిర్మించలేదు. దీనివల్ల ప్రతి ఏటా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎంతో ఉపయోగపడే గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. ఇలా వృథాగా పోతున్న గోదావరి నీటిలోని ప్రతి బొట్టును ఒడిసి పట్టి, ప్రజలకు అందించాలనే బలమైన సంకల్పంతోనే పోలవరం ప్రాజెక్టు ఆలోచన రూపుదిద్దుకుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం దశాబ్దాల సుదీర్ఘ చరిత్రను కలిగి ఉంది. జీవనది గోదావరి ప్రయాణంలాగే ఈ ప్రాజెక్టు ప్రయాణంలోనూ ఎన్నో మలుపులు చోటు చేసుకున్నాయి. గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన ఈ అతిపెద్ద పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌కు వరప్రదాయినిగా భావిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సాగునీరు, తాగునీరు ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయి. దీనితో పాటు విద్యుత్ ఉత్పత్తి రంగంలోనూ, పారిశ్రామిక అవసరాలను తీర్చడంలోనూ ఈ ప్రాజెక్టు ఎంతగానో సహాయపడుతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్నప్పటికీ, ఈ ప్రాజెక్టు ప్రయాణం మొదటి నుంచీ సాఫీగా సాగలేదు. అనేక ఒడుదొడుకులు, సవాళ్ల మధ్యనే పోలవరం పనులు ముందుకు సాగాయి.

#### చరిత్ర పుటల్లో పోలవరం ప్రాజెక్టు ఆలోచన

పోలవరం ప్రాజెక్టు ఆలోచనకు పునాది కొన్ని దశాబ్దాల క్రితమే పడింది. 1941లో మద్రాస్ ప్రెసిడెన్సీ హయాంలో గోదావరి నది వరదలను నివారించడానికి, తూర్పు గోదావరి జిల్లాకు నీటిని మళ్లించడానికి ఈ ప్రాజెక్టును మొదటిసారిగా ప్రతిపాదించారు. నాటి నీటిపారుదల ముఖ్య ఇంజినీరు ఎల్.వెంకటకృష్ణ అయ్యర్ పోలవరం సమీపంలో రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన నివేదికలు సిద్ధం చేశారు. అప్పట్లో ఈ ప్రాజెక్టుకు 'రామపాదసాగర్' అని పేరు పెట్టారు. దీని అంచనా వ్యయం అప్పట్లో 129 కోట్ల రూపాయలుగా లెక్కించారు. విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల అవసరాలకు నీటిని తరలించడం, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల సాగు, తాగు నీటి అవసరాలను తీర్చడం దీని ప్రధాన లక్ష్యాలు. విజయవాడ నుంచి గుండ్లకమ్మ నది వరకు మరో 143 కిలోమీటర్ల పొడవైన కాలువ నిర్మించాలని కూడా ప్రణాళికలు వేశారు. రామపాదసాగర్ ప్రాజెక్టు డిజైన్ పూర్తయినప్పటికీ, నిర్మాణపరంగా అడుగు ముందుకు పడలేదు. భారీ వ్యయం కావడం, నిర్మాణంలో ఉన్న సాంకేతిక సంక్లిష్టత దీనికి ప్రధాన కారణాలు. పోలవరం నిర్మించాల్సిన ప్రాంతంలో భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా లేవని నాటి ప్రభుత్వాలు భావించాయి. డ్యామ్ కట్టాల్సిన చోట ఎంతో లోతుకు వెళ్తే కానీ గట్టి భూమి లభించకపోవడం, కొండలు అడ్డంకిగా మారడంతో నాటి పాలకులు వెనకడుగు వేశారు.

#### అనుమతుల సాధన జాతీయ హోదా

1953లో గోదావరికి వచ్చిన భారీ వరదల వల్ల ఎంతో నీరు వృథాగా సముద్రంలోకి పోయింది. అదే సమయంలో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అవసరాల కోసం నీటి ఎద్దడి పెరిగింది. దీనితో గోదావరిపై రిజర్వాయర్ కట్టాలనే ప్రతిపాదన మళ్లీ తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా ఇతర పొరుగు రాష్ట్రాలతో కొన్ని కీలక ఒప్పందాలు జరిగాయి. ఈ క్రమంలోనే 2004లో పోలవరం ప్రాజెక్టు పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. 2005లో ఈ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులు లభించాయి. గిరిజన ప్రాంతాల ప్రజల తరలింపు, వారికి పునరావాసం కల్పించడం కోసం కేంద్ర గిరిజన శాఖ నుంచి 2007లో అనుమతులు వచ్చాయి. అటవీ ప్రాంత వినియోగానికి సంబంధించిన తుది అనుమతులు 2010లో లభించాయి. ఈ సుదీర్ఘ ప్రక్రియ తర్వాత 2014లో పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. ఈ ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో 276 గ్రామాలు, ఛత్తీస్‌గఢ్‌లో 4 గ్రామాలు, ఒడిశాలో 8 గ్రామాలు ముంపునకు గురవుతాయని, సుమారు 3427.52 ఎకరాల అటవీ భూమి మునిగిపోతుందని అంచనా వేశారు. 2014 రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణలోని ముంపు మండలాలైన కూనవరం, వరరామచంద్రాపురం, చింతూరు, భద్రాచలం... కొన్ని గ్రామాలు, వేలేరుపాడు, కుక్కునూరు, బూర్గంపాడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు.

#### గిన్నిస్ రికార్డుల నుంచి మినీ రిజర్వాయర్ స్థాయికి

గతంలో మిగిలి ఉన్న పనులను నవయుగ ఇంజనీరింగ్ సంస్థ ఒక సవాల్‌గా తీసుకుని రాత్రింబవళ్లు శ్రమించింది. 24 గంటల వ్యవధిలో 32 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటును వేసి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. 2019 జనవరి 6న ప్రారంభమైన ఈ ప్యానెల్ కాంక్రీట్ పనులు మరుసటి రోజు ఉదయానికి పూర్తయ్యాయి. ఇదే వేగంతో పనులు కొనసాగి ఉంటే 2020 జూన్ నాటికే ప్రాజెక్టు పూర్తయ్యేది. కానీ రాజకీయ కారణాలతో కాంట్రాక్టు రద్దు కావడంతో పనులన్నీ నిలిచిపోయాయి. ఖర్చు విపరీతంగా పెరగడం, కేంద్రం సవరించిన అంచనాలను సకాలంలో ఆమోదించక పోవడంతో అప్పటి ప్రభుత్వం పోలవరం నిర్మాణాన్ని రెండు దశలుగా విభజించింది. తొలి దశలో కేవలం 41.15 మీటర్ల కాంటూరుకే పరిమితం చేస్తూ, 115 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయాలని ప్రతిపాదించింది.

#### డబుల్ ఇంజిన్ సర్కార్ అండదండలు

2024 ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోలవరం ప్రాజెక్టుకు మళ్లీ కొత్త ఊపిరి వచ్చింది. ఐదేళ్ల విధ్వంసక పరిణామాల నుంచి ప్రాజెక్టు బయటపడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పనులను మళ్లీ సరైన మార్గంలో పెట్టేందుకు చర్యలు ప్రారంభించారు. కేంద్రంలో, రాష్ట్రంలో అనుకూల ప్రభుత్వాలు ఉండటంతో నిధుల కొరత తీరింది. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు అవసరమైన నిధులను ముందుగానే విడుదల చేస్తూ మద్దతుగా నిలుస్తోంది. ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో తెలియదనే నిరాశ నుంచి, 2027 నాటికి పోలవరాన్ని పూర్తిగా నిర్మించి ఖరీఫ్ సీజన్‌కు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నమ్మకంగా ప్రకటిస్తున్నారు.



### కాంట్రాక్టు సంస్థల మార్పు పెరిగిన ఖర్చులు

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోలవరం ప్రాజెక్టు పనుల వేగం మందగించింది. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైనది డయాఫ్రమ్ వాల్. 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో జర్మనీకి చెందిన బావర్ అనే అంతర్జాతీయ సంస్థతో నదీ గర్భంలో 70 మీటర్ల లోతున ఈ విభజన గోడను నిర్మించారు. జగన్ హయాంలో ఎగువ కాఫర్‌డ్యామ్‌లోని ఖాళీలను సకాలంలో పూరించకపోవడం వల్ల 2020లో వచ్చిన భారీ వరదలకు ఈ డయాఫ్రమ్ వాల్ తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల ప్రాజెక్టు ప్రధాన నిర్మాణానికే ముప్పు వాటిల్లిందనే విమర్శలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలు వద్దని వారించినా, అప్పటి ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థను మార్చి రివర్స్ టెండరింగ్‌కు వెళ్లింది. గతంలో పనిచేసిన నవయుగ సంస్థను తొలగించి మేఘా సంస్థకు పనులు అప్పగించారు. రూ.1,771 కోట్ల మిగిలిన పనులను రూ.1,548 కోట్లకు ఖరారు చేసి, రూ.223 కోట్లు ఆదా చేశామని ప్రకటించారు. కానీ ఆ తర్వాత అంచనాలను ఏకంగా రూ.2,300 కోట్లకు పెంచారు. గోదావరి ఇసుక రవాణా కోసం పొరుగు రాష్ట్ర సంస్థకు రూ.3,500 కోట్లు నామినేషన్ పద్ధతిపై కట్టబెట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఉచితంగా లభించిన ఇసుకకు భారీగా ఖర్చు చేయడం వివాదాస్పదమైంది. ఐదేళ్ల కాలంలో పనులు ముందుకు సాగకపోగా, ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజీకి గురైంది, గైడ్‌బండ్ కుంగిపోయింది.



# చెదిరిన సెమీస్ కలలు

## ఆస్ట్రేలియా దెబ్బతో భారత్‌కు షాక్

## ఫలించని హర్మన్‌ప్రీత్ పోరాటం

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు నిరాశ ఎదురైంది. లార్డ్స్ వేదికగా జరిగిన కీలక మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ ఓటమితో భారత్ సెమీఫైనల్ అవకాశాలు పూర్తిగా ముగిశాయి. గ్రూప్-ఏలో మూడో స్థానంతో భారత్ టోర్నీ ప్రయాణాన్ని ముగించాల్సి వచ్చింది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సెమీస్‌కు అర్హత సాధించాయి.

### కెప్టెన్ ఇన్నింగ్స్‌తో భారీ స్కోరు

టాస్ గెలిచిన ఆస్ట్రేలియా ముందుగా భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. భారత బ్యాటర్లు నిలకడగా ఆడుతూ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేశారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కేవలం 27 బంతుల్లో 56 పరుగులు చేసి జట్టుకు బలమైన స్కోరు అందించింది. ఆమె దూకుడు ఇన్నింగ్స్ అభిమానుల్లో విజయంపై ఆశలు పెంచింది. లక్ష్య ఛేదనలో భారత బౌలర్లు అద్భుత ఆరంభం అందించారు. తొలి దశలోనే మూడు కీలక వికెట్లు తీసి ఆస్ట్రేలియాపై ఒత్తిడి పెంచారు. మ్యాచ్ భారత్ వైపు మళ్లేలా కనిపించింది. ఫీల్డింగ్ కూడా కట్టుదిట్టంగా ఉండటంతో ప్రత్యర్థి జట్టు కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొంది.

### పెర్రీ, గార్డ్నర్ మ్యాచ్ మలుపు

ఆ తర్వాత ఎలీస్ పెర్రీ 38 బంతుల్లో 56 పరుగులు, అష్లే గార్డ్నర్ 29 బంతుల్లో అజేయంగా 53 పరుగులు చేసి నాలుగో వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ జోడీ భారత బౌలర్లకు అవకాశమే ఇవ్వకుండా విజయాన్ని ఖాయం చేసింది. ఇంకా ఒక ఓవర్ మిగిలి ఉండగానే ఆస్ట్రేలియా లక్ష్యాన్ని చేరుకుంది. భారత్ ఓడిపోయినా దీప్తి శర్మ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. మహిళల అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొత్త రికార్డు నెలకొల్పింది. వ్యక్తిగతంగా ఇది గొప్ప విజయమైనా, జట్టు సెమీస్‌కు చేరుకోలేకపోవడం అభిమానులను తీవ్రంగా నిరాశకు గురిచేసింది. ఇక భారత్ భవిష్యత్ టోర్నీల్లో మరింత బలంగా తిరిగి రావాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు బెన్ స్టోక్స్ గుడ్‌బై

## మూడో టెస్టే చివరి మ్యాచ్, అనూహ్య ప్రకటన



ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టు ముగిసిన వెంటనే తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకనున్నట్లు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. ఈ వార్తతో క్రికెట్ అభిమానులు ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. నాటింగ్ హామ్‌లోని ట్రెంట్ బ్రిడ్జ్ మైదానంలో ఈ ప్రకటన వెలువడగానే ప్రేక్షకులు లేచి నిలబడి స్టోక్స్‌కు ఘనంగా చప్పట్లు కొట్టారు. అనంతరం న్యూజిలాండ్ బ్యాటర్ జాక్ ఫాల్క్‌ను ఔట్ చేసి మరోసారి అభిమానుల ప్రశంసలు అందుకున్నాడు. ఒత్తిడి పరిస్థితుల్లో జట్టును విజయపథంలో నడిపించిన కెప్టెన్‌గా స్టోక్స్ ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. 2019 వన్డే ప్రపంచకప్, 2022 టీ20 ప్రపంచకప్ విజయాల్లో కీలక పాత్ర పోషించిన స్టోక్స్, హెడ్డింగ్లే యాషెస్ ఇన్నింగ్స్‌తో చిరస్థాయిగా గుర్తుండిపోతాడు. టెస్టు జట్టుకు సాహసోపేత నాయకత్వం వహించిన అతని నిర్ణయం ఇంగ్లండ్ క్రికెట్‌లో ఒక గొప్ప అధ్యాయానికి ముగింపు పలికిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# బీసీసీఐ తప్పటడుగులు

## పసికూన చేతిలో వరుస ఓటములు

### ఇండియాకు షాకిచ్చిన ఐర్లాండ్

### ఒక్క పరుగుతో భారత్ జట్టు చిత్తు

### సిరీస్‌ను చేజార్చుకున్న భారత్

బెల్‌ఫాస్ట్‌లో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఐర్లాండ్ సంచలన విజయం సాధించింది. కేవలం ఒక పరుగుతో భారత్‌ను ఓడించి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత జట్టుకు ఈ ఫలితం పెద్ద ఎదురుదెబ్బగా మారింది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో ఐర్లాండ్ ఒత్తిడిని తట్టుకుని విజయాన్ని అందుకుంది.

### ముందుగా బౌలింగ్ ఎంచుకున్న శ్రేయస్

టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ముందుగా బౌలింగ్‌ను ఎంచుకున్నాడు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఐర్లాండ్‌ను 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 154 పరుగులకే పరిమితం చేశారు. ప్రిన్స్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ చేసి 22 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టాడు. అర్షదీప్ సింగ్ రెండు వికెట్లు, శివమ్ దూబే రెండు వికెట్లు తీసి జట్టుకు బలమైన స్థితి కల్పించారు.

### లక్ష్య ఛేదనలో తడబడిన బ్యాటర్లు

155 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఆరంభం నుంచే ఒత్తిడిని ఎదుర్కొంది. కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో పరుగుల వేగం తగ్గిపోయింది. చివరి ఓవర్లలో విజయం కోసం పోరాడినా లక్ష్యానికి ఒక్క పరుగు దూరంలోనే ఆగిపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 9 వికెట్ల నష్టానికి 153 పరుగులు మాత్రమే చేయగలిగింది.

### ఆత్మపరిశీలన అవసరమైన సమయం

స్వల్ప లక్ష్యాన్ని కూడా ఛేదించలేకపోవడం భారత జట్టు బ్యాటింగ్ వైఫల్యాన్ని స్పష్టంగా చూపించింది. కీలక సందర్భాల్లో బాధ్యతాయుతమైన ఆట కనిపించకపోవడం ఓటమికి ప్రధాన కారణంగా మారింది. మరోవైపు ఐర్లాండ్ సమష్టి ప్రదర్శనతో ప్రతి విభాగంలో మెరుగైన ఆట కనబరిచి చారిత్రక సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ ఫలితం తర్వాత భారత జట్టు తన బలహీనతలను సరిదిద్దుకుని రాబోయే సిరీస్‌లకు సిద్ధం కావాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.





# నా భార్తకు ఎన్నో ఎఫైర్లు..

## గోవిందపై భార్య సంచలన వ్యాఖ్యలు

## వేదికపై బయటపడ్డ వ్యక్తిగత జీవితం

బాలీవుడ్ నటుడు గోవింద దాంపత్య జీవితం మరోసారి చర్చనీయాంశంగా మారింది. రియాలిటీ షోలో పాల్గొన్న ఆయన భార్య సునీత అహూజా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివాహ జీవితంలో గోవిందకు అనేక ప్రేమ వ్యవహారాలు ఉన్నాయని ఆమె బహిరంగంగా చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. షో హోస్ట్ అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, ప్రేమలో ఉంటే ఎన్నో విషయాలను భరించాల్సి వస్తుందని సునీత వ్యాఖ్యానించింది. సినీ పరిశ్రమలో హీరోలు, హీరోయిన్ల మధ్య ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయని చెప్పింది. అయినప్పటికీ ఎన్నో సంవత్సరాలు గోవిందతో కలిసి ప్రయాణించానని, అందుకే తనకు ఆయనలాంటి కుమారుడు కావాలని సరదాగా వ్యాఖ్యానించింది. మరో వ్యాఖ్యలో మూడో వ్యక్తి జీవితంలోకి వస్తే సమస్యలు తప్పవని హాస్యంగా చెప్పింది. దీంతో ఈ ఎపిసోడ్‌కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. గోవింద, సునీత 1987లో వివాహం చేసుకున్నారు. కొంతకాలం తమ వివాహాన్ని రహస్యంగా ఉంచిన ఈ దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం సునీత వ్యాఖ్యలపై అభిమానుల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది.

# కావ్య మరన్ అనిరుధ్ మ్యారేజ్?

## ఒక్క వ్యాఖ్యతో వార్తలు వైరల్.. సోషల్ మీడియాలో పెళ్లి సందడి





ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఉత్సాహంగా మద్దతు ఇస్తూ అభిమానుల దృష్టిని ఆకర్షించిన కావ్య మరన్ ఇప్పుడు వ్యక్తిగత జీవితంతో వార్తల్లో నిలిచారు. ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో ఆమె వివాహం జరగబోతుందనే ప్రచారం ఒక్కసారిగా సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వార్తలకు అనిరుధ్ కుటుంబ సభ్యుడు చేసిన వ్యాఖ్యలు మరింత ఊతమిచ్చాయి. ఒక ఇంటర్వ్యూలో అనిరుధ్ మామ, నటుడు వై.జి. మహేంద్ర మాట్లాడుతూ ఇద్దరూ త్వరలో వివాహం చేసుకోబోతున్నారని తాను విన్నట్లు తెలిపారు. కావ్య సాధారణ యువతి కాదని, పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని సమర్థంగా నడిపే సామర్థ్యం ఉన్న వ్యక్తి అని ప్రశంసించారు. ఇద్దరూ మంచి జోడీ అవుతారని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఇప్పటివరకు కావ్య మరన్, అనిరుధ్ ఈ ప్రచారంపై అధికారికంగా స్పందించలేదు. 'వై దిస్ కొలవెరి డి'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అనిరుధ్ ప్రస్తుతం దక్షిణాది సినీ సంగీతంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. మరోవైపు సన్ టీవీ నెట్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, సన్‌రైజర్స్ ఫ్రాంచైజీల బాధ్యతలు నిర్వహిస్తున్న కావ్య మరన్‌కు కూడా ప్రత్యేక గుర్తింపు ఉంది. అధికారిక ప్రకటన కోసం ఇప్పుడు సినీ, క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఆరేళ్ల తర్వాత 'హ్యాంగ్‌మ్యాన్'

## నేరుగా ఓటీటీలో విడుదల

ఎప్పుడో ప్రారంభమైన ఓ మిస్టరీ థ్రిల్లర్.. మధ్యలో నిశ్శబ్దంగా కనుమరుగైన సినిమా.. ఇప్పుడు అనూహ్యంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. నటుడు బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో రూపొందిన 'హ్యాంగ్‌మ్యాన్' ఆరేళ్ల నిరీక్షణ తర్వాత జూలై 3 నుంచి సన్ నెక్స్ట్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. థియేటర్లకు దూరంగా నేరుగా డిజిటల్ వేదికను ఎంచుకోవడం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. "న్యాయానికి ఒక ధర ఉంటుంది.. నిజానికి ఒక గడువు ఉంటుంది" అనే ట్యాగ్‌లైన్‌తో ప్రచారం సాగుతోంది. ఉరిశిక్ష అమలు చేసే వ్యక్తి దాచిన నిజాన్ని బయటపెడతాడా? లేక శాశ్వతంగా సమాధి చేస్తాడా? అనే ప్రశ్న చుట్టూ కథ తిరుగుతుందని చిత్రబృందం చెబుతోంది. వృద్ధుడి గెటప్‌లో బ్రహ్మాజీ కనిపించనున్న తీరు ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దర్శకుడు విహాన్ తెరకెక్కించిన ఈ చిత్రం ఇంఫాల్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. బన్నీ అబిరాన్, వినయ్ నల్లకాడి కీలక పాత్రలు పోషించారు. కమ్రాన్ అందించిన నేపథ్య సంగీతం థ్రిల్లర్‌కు మరింత ఉత్కంఠను జోడించనుందని చిత్రబృందం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.






# హిట్‌లే ఆయుధం

## ఒకేసారి రెండు సీక్వెల్స్

## ఫ్రాంచైజీలతో తేజ సజ్జ దూకుడు

వరుస విజయాలతో యువ హీరో తేజ సజ్జ టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. 'జాంబీ రెడ్డి', 'హనుమాన్', 'మిరాయ్' చిత్రాలతో మార్కెట్‌ను బలంగా నిర్మించుకున్న తేజ ఇప్పుడు కొత్త ప్రయోగాల కంటే ఇప్పటికే విజయవంతమైన కథలకే ప్రాధాన్యం ఇస్తున్నాడు. కెరీర్‌లో విజయాల పరంపర కొనసాగించాలనే లక్ష్యంతో జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాడు. ప్రస్తుతం 'జాంబీ రెడ్డి 2' షూటింగ్ హైదరాబాద్‌లో నిశ్శబ్దంగా సాగుతోంది. ప్రశాంత్ వర్మ కథ, స్క్రీన్‌ప్లే అందిస్తుండగా కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. మరోవైపు భారీ అంచనాల మధ్య 'జై హనుమాన్' పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో హనుమంతుడి పాత్రలో రిషబ్ శెట్టి కనిపించనుండగా, తొలి భాగంలోని తన పాత్రను తేజ సజ్జ మరోసారి పోషించనున్నాడు. ఒకేసారి రెండు సీక్వెల్స్‌ను ముందుకు తీసుకెళ్తున్న తేజ సజ్జ తన కెరీర్‌కు బలమైన పునాది వేసిన ఫ్రాంచైజీలనే మరింత విస్తరించే వ్యూహంతో ముందుకు సాగుతున్నాడు. అన్ని అనుకున్నట్లు జరిగితే ప్రేక్షకుల ముందుకు వరుసగా ఈ రెండు సినిమాలే రానున్నాయి. దీంతో తేజ సజ్జ మరోసారి బాక్సాఫీస్‌పై తన ముద్ర వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.



# వారణాసికి విదేశాల్లో భారీ డీల్

## చివరి దశలో ఓవర్సీస్ ఒప్పందం

ఇంకా షూటింగ్ దశలోనే ఉన్నా దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రపంచ సినీ వర్గాల్లో సంచలనంగా మారుతోంది. సోషల్ మీడియాలో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రం ఇప్పుడు బిజినెస్ పరంగా మరో రికార్డుకు చేరువైంది. విదేశీ థియేట్రికల్ హక్కుల విక్రయానికి చర్చలు తుది దశకు చేరుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొదట నిర్ణయించిన ఓవర్సీస్ హక్కుల ధర చాలా ఎక్కువగా ఉండటంతో సాధారణ తెలుగు డిస్ట్రిబ్యూటర్లు వెనక్కి తగ్గినట్లు సమాచారం. చివరకు కొద్దిమంది మాత్రమే పోటీలో నిలవగా, దుబాయ్‌కు చెందిన ఫార్స్ ఫిల్మ్స్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో రాజమౌళి, ప్రభాస్ చిత్రాలను విదేశాల్లో విజయవంతంగా విడుదల చేసిన అనుభవం ఈ సంస్థకు ఉంది. మహేష్ బాబు హీరోగా, ప్రియాంక చోప్రా, ప్రకాశ్ రాజ్, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం రామాయణ అంశాలను టైమ్ ట్రావెల్, ఫాంటసీతో మేళవించిన గ్లోబల్ అడ్వెంచర్ డ్రామాగా రూపొందుతోంది. 2027 ఏప్రిల్ 7న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానుల చూపు నిలిచింది.

This newspaper is Owned and Published by **KANTIPUDI RAVENDRA** from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: **KANTIPUDI RAVENDRA**, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com. Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085